TGTEL/25/A0977

# తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదల

**- నవంబర్ 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం**

(హైదరాబాద్, నవంబర్ 13)

తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) 2025 రెండో విడత నోటిఫికేషన్ విడుదలైంది. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ గురువారం అధికారికంగా ప్రకటన చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు దరఖాస్తులకు సిద్ధం కావాలని సూచించింది. నవంబర్ 15 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుండగా, నవంబర్ 29వ తేదీతో ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ ముగియనుంది. జనవరి 3 నుంచి 31 వరకు టెట్ పరీక్షలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షల షెడ్యూల్, విధానం, సిలబస్, హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ తేదీల విషయంగా త్వరలో మరిన్ని వివరాలు విడుదల చేయనున్నట్లు సమాచారం. టెట్ అర్హత ఆధారంగా భవిష్యత్ టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అవకాశం పొందే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాదిలో టెట్ కోసం ఇది రెండో విడత నోటిఫికేషన్. మొదటి విడత టెట్ నోటిఫికేషన్ జూన్‌లో విడుదల కాగా, పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి.


# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి


# పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల

**- మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నామన్నమంత్రి పొంగులేటి**

**- రాష్ట్రవ్యాప్తంగా 101 రిజర్వాయర్లలో పెద్ద సైజు రొయ్య పిల్లల విడుదలకు సిద్ధం**

**(ఖమ్మం, నవంబర్ 13)**



ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తూ, వారి జీవనోపాధిని బలోపేతం చేస్తోందని ఆయన తెలిపారు. మత్స్యకార సంఘాల అభ్యర్థన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 101 రిజర్వాయర్లలో పెద్ద సైజు రొయ్య పిల్లలను రాబోయే 15 రోజుల్లో ప్రభుత్వం విడుదల చేయనుందని ఆయన తెలిపారు. చేపల ఉత్పత్తి పెరిగి, మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరుగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. "ప్రతి కులం, ప్రతి వర్గం గౌరవంతో జీవించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. పేదల అభివృద్ధి మా మొదటి లక్ష్యం" అని పొంగులేటి పేర్కొన్నారు.


సంపుటి : 1 | సంచిక : 78 | శుక్రవారం 14-11-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.


# పెట్టుబడులు పెట్టండి

## ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం హైదరాబాద్

**గత ప్రభుత్వాలన్నీ పెట్టుబడులకు పెద్దపీట వేశాయ్.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**'యూఎస్ ఐఎస్‌పీఎఫ్'లో సీఎం రేవంత్.. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ ప్రదర్శన.. టెక్ దిగ్గజాల ప్రశంసలు**

**న్యూఢిల్లీ, నవంబరు 13:** హైదరాబాద్ నగరం ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులకు హైదరాబాద్ స్వర్గధామం అన్నారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఢోకా లేదని తెలిపారు. దేశంలోనే వేగవంతమైన వృద్ధి రేటు కలిగిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. రాష్ట్రంలో యువశక్తి ఎక్కువగా ఉందని గుర్తుచేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు- భారతదేశ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యూఎస్ ఐఎస్‌పీఎఫ)లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో గత 35 ఏళ్లుగా కాంగ్రెసతోపాటు అనేక పార్టీల ప్రభుత్వాలు సారథ్యం వహించినా.. పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు మద్దతుగా నిలిచాయని వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖద్వారమని తెలిపారు. అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాల (జీసీసీ) హబ్‌గా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితోపాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. 30 వేల ఎకరాల్లో అద్భుతమైన మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. మూసీ నది పునరుజ్జీవం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయ్, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్డు - రీజినల్ రింగ్ రోడ్డు మధ్య తయారీ జోన్ వంటి కీలక మౌలిక ప్రాజెక్టుల పురోగతిని సీఎం వివరించారు. చైనా ప్లస్ 1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని చెప్పారు (చైనాకు అదనంగా మరో ఉత్పాదక కేంద్రం ఏర్పాటును చైనా ప్లస్ 1 మోడల్ అంటారు).




**రోడ్లకు ఆ సంస్థల పేర్లు పెడతాం..!**

భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నాయకుల పేర్లు ఉంటాయని, హైదరాబాద్‌లో ఆ ట్రెండ్‌ను మార్చేయాలని అనుకుంటున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల పేర్లను పెడతామని ప్రకటించారు. అలాగే, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే, తక్కువ ఖర్చు అవుతుందని తెలిపారు. సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పారు. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానించారు. సదస్సు ప్రారంభంలో ఆయన 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యానికి విశేష ఆదరణ లభించింది. అంతర్జాతీయ పెట్టుబడిదారులకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను సీఎం వివరించిన తీరు ప్రపంచ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి వెంట తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఉన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా (బోల్డ్), సాధించగలిగేలా ఉందని టెక్ దిగ్గజం, సిస్కో మాజీ సీఈవో జాన్ చాంబర్స్ కొనియాడారు.

# బీసీ రిజర్వేషన్లు భిక్ష కాదు.. మా హక్కు

**సీఎం అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలవాలి...**

**పార్లమెంట్‌లో రాజ్యాంగాన్ని సవరించేలా ఒత్తిడి తేవాలి**

**బీసీలను మోసం చేస్తే రాష్ట్ర సర్కారుపై తిరుగుబాటే: జాజుల**

**బీసీ రిజర్వేషన్లపై మోదీతో మాట్లాడతా: బండారు దత్తాత్రేయ**

**ప్రభుత్వాలు పట్టింపులకు పోతే ఉవ్వెత్తున ఉద్యమం: కోదండరాం**

**ఇందిరా పార్క్ వద్ద బీసీల ధర్మ పోరాట దీక్ష**



**కవాడిగూడ, నవంబరు 13:** బీసీ రిజర్వేషన్లు ఎవరో ఇచ్చే భిక్ష కాదని.. తమ హక్కు అని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాసగౌడ్ వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే విషయమై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించే విషయమై కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. ప్రధాని సమయం ఇవ్వకపోతే ఇండియా కూటమి తరఫున పార్లమెంట్ సమావేశాలను స్తంభింపచేయాలని.. కేంద్రంపై పోరాటానికి కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో జాజుల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఇందులో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ కోదండరాం, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మ?ధుసూదనాచారి, ఎల్.రమణ, మాజీమంత్రి శ్రీనివాసగౌడ్‌తో పాటు 136 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, 40 బీసీ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీతో కొట్లాడుతారో, బీసీ దోషులుగా నిలబడతారో కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చుకోవాలన్నారు. బీసీలను నమ్మించి మోసం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎవరు?

**నేడే ఉప ఎన్నిక ఫలితం**

**ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం**

**తొలుత హోం ఓటింగ్, సర్వీస్ ఓట్లు**

**మధ్యాహ్నం 12 గంటలకల్లా తుది ఫలితం**

**కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు**



**హైదరాబాద్ సిటీ, నవంబరు 13:** తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు శుక్రవారం వెల్లడవనున్నాయి. ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎన్నికల్లో విజేత ఎవరన్నది మధ్యాహ్నానికల్లా తేలిపోనుంది. యూసుఫగూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ గురువారం చెప్పారు. 4.01 లక్షల ఓటర్లున్న నియోజకవర్గంలో 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు నవీన్ యాదవ్, మాగంటి సునీతా గోపీనాథ్, లంకల దీపక్‌రెడ్డిలకు మద్దతుగా నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. నోటాతో కలిపి 59 గుర్తులు ఉండడంతో నాలుగు బ్యాలెట్ యూనిట్లు వినియోగించారు. నగర ఓటర్ ఎప్పటిలానే బద్ధకించడంతో 48.49 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది.

**గంటలో తొలి రౌండ్ ఫలితం..**

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు కానుండగా.. తొలుత 85 ఏళ్లు దాటిన, దివ్యాంగులు వినియోగించుకున్న 101 హోం ఓటింగ్, సర్వీస్ ఓట్లు లెక్కించనున్నారు. అనంతరం షేక్‌పేట డివిజన్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. పోలింగ్ కేంద్రం సంఖ్య 1 నుంచి వరస క్రమంలో లెక్కింపు చేపడతారు. కౌంటింగ్ కోసం 42 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 10 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులు, ప్రత్యేక బృందం ఈ ప్రక్రియను పరిశీలించనుంది. లెక్కింపు కోసం 186 మంది సిబ్బందిని నియమించినట్లు కర్ణన్ తెలిపారు. లెక్కింపు మొదలైన గంటలోపే తొలి రౌండ్ ఫలితం వచ్చే అవకాశం ఉంది. తర్వాత ప్రతి 25-30 నిమిషాల్లో ఒక్కో రౌండ్ ఓట్ల ఫలితాలను వెల్లడించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల్లోపు లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లెక్కింపు నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ జాయింట్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ఏఐసీసీ అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేయను!

**- యువతకు ఉపయోగపడే పుస్తకం.. మహాభారతమే - జ్యోతి కొమిరెడ్డి స్మారక ఉపన్యాసంలో శశిథరూర్**

**హైదరాబాద్ సిటీ, నవంబరు 13:** గతంలో రాజకీయ నాయకుల మధ్య ఆలోచనా విధానంలో భిన్నాభిప్రాయాలున్నా.. అవి ఆ అంశాల వరకే పరిమితమై ఉండేవని.. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకునేవారని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. నెహ్రూ-వాజపేయి, ఇందిరాగాంధీ-వాజపేయి హయాంలో కూడా అది కనిపించిందని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ సోమాజీగూడలోని ఓ హోటల్‌లో మాజీ ఎంఎల్‌ఏ జ్యోతి కొమిరెడ్డి స్మారకసభలో ఆయన పాల్గొని.. 'రాడికల్ సెంట్రిజం.. మై విజన్ ఫర్ ఇండియా' అనే అంశంపై ప్రసంగించారు. జ్యోతి కొమిరెడ్డి గొప్ప న్యాయవాది అని.. మహిళల హక్కుల కోసం నినదించిన మానవతావాది అని, చట్ట సభల్లో 33% మహిళలకు రిజర్వేషన్ల కేటాయింపు కోసం పోరాడారని కొనియాడారు. తన ప్రసంగంలో భాగంగా ఆయనప్రస్తుత రాజకీయాలు సహా పలు అంశాల గురించి మాట్లాడారు. ఏఐసీసీ ప్రెసిడెంట్‌గా మళ్లీ పోటీ చేస్తారా? అనే ప్రశ్నకు.. "ఐన్‌స్టీన్ చెప్పినట్లు.. పిచ్చితనం నిర్వచనం ఏమిటంటే.. ఎటువంటి ఫలితాలను ఆశించకుండా అదే (ఒకే) పనిచేయడం" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. తాను పోటీ చేయననే విషయాన్ని చెప్పకనే చెప్పారు. దీనిపై మరింత వివరణ ఇస్తూ.. "అప్పటి పరిస్థితులు వేరు. అప్పుడు పోటీ చేయడం వల్ల పొందిన అనుభవాలను పబ్లిక్‌గా చెప్పలేను. కానీ. ఒకటి మాత్రం చెప్పగలను. కాంగ్రెసలో అంతర్గత ప్రజాస్వామ్యం వల్ల ఏమైనా చేయొచ్చు. అది ఏ రాజకీయ పార్టీకైనా ఉండాల్సిన గొప్ప లక్షణం. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పుడు పార్టీలు కూడా ప్రజాస్వామ్యయుతంగానే ఉండాలి... అంత వరకే మాట్లాడగలను" అని వ్యాఖ్యానించారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి సవాళ్లు ఎదురయ్యే పహల్గాం లాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ప్రతిపక్షాల విమర్శలు బాధ్యతాయుతంగా, నిర్మాణాత్మకంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పౌర హక్కుల ఉద్యమానికి తానెప్పుడూ మద్దతుదారునే అని.. అణగారిన వర్గాల పక్షాన మాట్లాడటానికి సిద్ధంగా ఉంటానని స్పష్టం చేసిన శశిథరూర్.., రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమైన భావాలు కలిగిన వామపక్ష తీవ్రవాదాన్ని మాత్రం తాను సమర్థించనని కరాఖండీగా చెప్పారు. యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటే ముందుగా 'ఎందుకు?' అనే ప్రశ్న వారే వేసుకోవాలని సూచించారు. డబ్బు సంపాదన గురించి రాజకీయాల్లోకి రావాలనుకోవడం తప్పని స్పష్టం చేశారు. యువతకు ఉపయోగపడే ఏదైనా పుస్తకం గురించి చెప్పాలని అడిగితే.. మహాభారతం చదవమని చెబుతానన్నారు. కోర్టుల్లో ఏళ్లతరబడి సాగుతున్న కేసుల పరిష్కారానికి కృత్రిమ మేధను వినియోగించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో ఏది బాగా నచ్చిందని అడిగినప్పుడు.. రోడ్లు బాగున్నాయని చెప్పారు.



# పోస్టర్ లాగితే ఉగ్రకుట్ర భగ్నం..

**పోస్టర్‌పై రాతల ఆధారంగా దర్యాప్తు**

**సీసీ కెమెరాల జల్లెడ.. హరియాణా, యూపీ పోలీసుల సాయంతో సోదాలు**

**జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర కుట్ర భగ్నంలో తెలుగు అధికారి చక్రవర్తి కీలకపాత్ర**

**కర్నూలు, నవంబరు 13:** అది శ్రీనగర్‌లోని నౌగామ్ ప్రాంతం.. ఈ ఏడాది అక్టోబరులో అక్కడ కొన్నిచోట్ల పోలీసులు, భద్రతా దళాలను హెచ్చరిస్తున్నట్టుగా పోస్టర్లు వెలిశాయి. అందరూ దీన్నో సాధారణ విషయంగా భావించారు..! కానీ, ఒక పోలీస్ అధికారి మాత్రం ఆ పోస్టర్లను నిశితంగా పరిశీలించారు. ఆ రాతల వెనుక ఉద్దేశం ఉగ్రకుట్రకు సంకేతమై ఉండొచ్చని అనుమానించి దర్యాప్తు ప్రారంభించారు. తీగ లాగుకుంటూ వెళితే.. 2,900 కిలోల ఐపీడీ, స్లీపర్ సెల్స్ లింకులతోపాటు దేశాన్ని విచ్ఛిన్నం చేసే భారీ ఉగ్రకుట్ర బయటపడింది. ఇంతకీ ఆ పోస్టర్ వెనుక ఉగ్ర కుట్రను ఛేదించిన అధికారి ఎవరో కాదు. మన తెలుగు తేజం డాక్టర్ జీవీ సందీప్ చక్రవర్తి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నగరానికి చెందిన ఆయన ప్రస్తుతం శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఈ కుట్ర భగ్నం వెనుక ఆయనతోపాటు ఎందరో అధికారుల పాత్ర ఉన్నప్పటికీ.. కేవలం ఒక పోస్టర్ ఆధారంగా ఛేదించిన చక్రవర్తి కీర్తి మాత్రం సామాజిక మాధ్యమాల్లో మార్మోగిపోతోంది..! ఇలాంటి ప్రచారం ఆయన భద్రతకు ప్రమాదమని, వందలాది మంది పోలీసు అధికారుల్లో ఒకడిగా తమ కొడుకు ఈ పనిచేశారని ఆయన తల్లిదండ్రులు చెబుతున్నారు.

**భగ్నం చేశారిలా...**

అక్టోబరు 19న శ్రీనగర్‌లోని నౌగామ్‌లో జేషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. వాటి ఆధారంగా నౌగామ్ పోలీసస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. జమ్మూకశ్మీర్ పోలీసులు అనేక ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. హరియాణా పోలీసులతో కలిసి ఫరీదాబాద్‌లో, ఉత్తరప్రదేశ్ పోలీసుల సాయంతో సహరాన్‌పూర్‌లో తనిఖీలు చేపట్టారు. సీసీ కెమెరాలు రికార్డులను జల్లెడపట్టారు. ఈ క్రమంలో విదేశీ హ్యాండ్లర్లతో సంబంధాలు కలిగి, తీవ్రవాద భావాలున్న నిపుణులు, డాక్టర్లు, విద్యార్థులతో కూడిన వైట్ కాలర్, ఉగ్ర వ్యవస్థను గుర్తించారు.

# సోయా, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సడలింపులివ్వండి

**కేంద్రానికి మరోమారు మంత్రి తుమ్మల లేఖ..**

**హైదరాబాద్, నవంబరు 13:** సోయా బీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలని, పంట కొనుగోళ్లలో సడలింపులివ్వాలని మరోమారు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. రాష్ట్రంలో మొంథా తుఫాన్, అకాల వర్షాలు, అనిశ్చిత వాతావరణం కారణంగా సోయా బీన్,



మొక్కజొన్న, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ఈ పంటల కొనుగోళ్ల విషయంలో కొన్ని ప్రత్యేక సడలింపులివ్వాలని కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, గిరిరాజ్ సింగ్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'సోయా బీన్ కోత సమయంలో కురిసిన అకాల వర్షాల వల్ల పంట నాణ్యత దెబ్బతినడంతో పాటు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ మేరకు నాణ్యతా ప్రమాణాల విషయంలో సడలింపులివ్వాలి. కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య, జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య సంస్థలకు అనుమతి ఇవ్వాలి. ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పత్తి కొనుగోలు విషయంలో తేమ శాతాన్ని సడలించాలి. ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలి' అని లేఖలో తుమ్మల కోరారు. ఈ విషయాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా గురువారం ఢిల్లీకి వెళ్లినముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా కోరామని తెలిపారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలి



**రాయికల్, నవంబర్ 13:**
మహిళ సంఘ సభ్యులలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చెయాలని ఎంపిఓ సుష్మ, ఎపిఎం నరహరి అన్నారు. రాయికల్ పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ "వయోజన విద్య" అమలుపై గ్రామ సంఘ కార్యవర్గ సభ్యులకు, కార్యదర్శులకు, విఓఏలకు శిక్షణ కార్యక్రమము నిర్వహించారు. మండలంలోని మహిళ సంఘ సభ్యులందరిని అక్షరాస్యులుగా తయారుచేసి...సంఘాల ఆర్థిక లావాదేవిలు స్వయంగా నిర్వహించేలా తయారు చేయాలని...చదువు విజ్ఞన నేత్రాన్ని సభ్యులకు అందించి మరింత గౌరవప్రదమైన జీవనానికి దోహాదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానవాభివృద్ధి విభాగం ఏపిఎం విమోచన, సీసీలు గంగారం, సుజాత, లావణ్య, సిఆర్పిలు అనిత, కౌసర్, మండల విఓలు, విఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న చలి తీవ్రత

**ఇళ్ల పథకంలో క్రెడిట్ చోరీ స్కీమ్**

**18 నెలల కాలంలో ఒక్క గజం కేటాయింపు ఏదీ**

**ఎక్స్ వేదికగా వైకాపా నేత జగన్ విమర్శలు**

ఏపీ సిఎం చంద్రబాబు కథ, స్క్రీన్, ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుందని వైఎస్ జగన్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ఈ 18 నెలల కాలంలో ఒక్క గజం స్థలం కూడా సేకరించలేదని, ఒక్క సెంటు స్థలం కూడా ఎవరికీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఇళ్ళ కోసం ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని, ఒక్కరికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లను చూపిస్తూ 'ఇళ్లన్నీ మేమే కట్టేశాం' అంటూ పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' హేయంగా ఉందని పేర్కొన్నారు. తాము ప్రారంభించామని చెప్పుకుంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటిపట్టా కూడా చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వలేదని, ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయించ లేదని తెలిపారు. ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు తమ హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నవేనని జగన్ పేర్కొన్నారు. మరో 87,380 ఇళ్లు శ్లాబ్ లెవల్ వరకూ గత ప్రభుత్వ హయాంలోనే కట్టించినవేనని తెలిపారు. ఇవికాక అక్టోబరు 12, 2023న ఒకేసారి 7,43,396 ఇళ్లలో ఒకేరోజు గృహప్రవేశాలతో గత ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని, ఇన్ని వాస్తవాలు కళ్ళముందే ఉన్నా? అసలు వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయనట్టుగా, అన్నీ ఈ ప్రభుత్వమే చేసినట్టుగా పచ్చి అబద్దాలను ప్రచారం చేస్తున్న చంద్రబాబు క్రెడిట్ చోరీ స్కీం చాలా హేయమని జగన్ ఆగ్రహించారు.మా హయాంలో 71.8 వేల ఎకరాల్లో 31.19 లక్షల ఇళ్ల పట్టాలను అక్కచె÷-లలెమ్మలకు ఇచ్చి, వారి పేరుమీదే రిజిస్ట్రేషన్ చేయించాం. 21.75 లక్షల ఇళ్లను శాంక్షన్ చేయించి?కోవిడ్‌లాంటి మహమ్మారి ద్వారా తలెత్తిన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ 9 లక్షలకుపైగా ఇళ్లను మా హయాంలోనే పూర్తిచేసినా, అన్నీ మీరే చేశారన్నట్టుగా మీరు చెప్పడమే కాకుండా, మీ ఎల్లోమీడియా ద్వారా ప్రచారం చేయించుకుని, ఆ క్రెడిట్ కొట్టేయాలనుకుంటున్న మీ స్కీం చాలా హేయం అంటూ విమర్శలు గుప్పించారు.

## విశాఖలో ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన

**వేలాదిమందికి ఉద్యోగావకాశాలు వస్తాయని వెల్లడి**

**విశాఖపట్నం,నవంబర్13:**
విశాఖ ఐటీ హిల్స్‌లో ఐటీ సహా పలు కంపెనీలకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు, వేలాది మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. మంత్రితో పాటు సెయిల్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో, ఎండీ కిరణ్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ హరి బైర్రెడ్డి, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే ఏఐ ఎక్స్‌లెన్స్ సెంటర్ ద్వారా 430మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎండీ కిరణ్ వెల్లడించారు. డిజిటల్ ఆంధ్రప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్‌పై సెయిల్స్ సాఫ్ట్ వేర్ సంస్థ దృష్టిసారించనుంది. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. విశాఖ యూనిట్‌పై రెండుదశల్లో రూ.207.5 కోట్లు పెట్టుబడి పెట్టి.. 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు హరి బైర్రెడ్డి వెల్లడించారు.

# జూబ్లీహిల్స్ ఫలితంతో రాజకీయ పార్టీల భవిష్యత్

**- హోరాహోరీగా పోరాడిన కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి**

**- గెలుపుపై ఎవరి అంచనాలు వారివే - ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం**

**హైదరాబాద్,నవంబర్ 13:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం మరో 24 గంటల్లో తేలనుంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్, ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేదెవరో శుక్రవారం తేలనుంది. ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. పార్టీ అభ్యర్ది గెలుపు ఖాయమని ధీమాలో అధికార కాంగ్రెస్ ఉంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయ పార్టీల భవిష్యత్ తేల్చనుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ , ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి.

బిజెపి కూడా గెలిచి తీరాలన్న పట్టుదలతో పోరాడింది. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. సాధారణంగా ఎక్కడైనా ఉప ఎన్నికలో భారీగా పోలింగ్ శాతం నమోదు అవుతుంటుంది. కానీ జూబ్లీహిల్స్‌లో మాత్రం ఒక్క శాతమే ఓటింగ్ పెరగడంతో.. గెలుపు ఎవరిని వరిస్తుందా అనేది తెలియని పరిస్థితి. తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ పార్టీ, కాదు కాదు తామే గెలుస్తామంటూ బీఆర్ఎస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సర్వేలు అన్నీ తమ వైపే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతుండగా.. సైలెంట్ ఓటింగ్ జరిగిందని.. తద్వారా తమ విజయం ఖాయమని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. మొత్తంగా శుక్రవారం మధ్యాహ్నం తుది ఫలితం వెల్లడయ్యే వరకు ఉత్కంఠ తప్పని పరిస్థితి. ఇప్పటికే అధికారులు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో లెక్కింపు ప్రారంభం కానుంది. పది రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉప ఎన్నికలో లక్షా 94 వేల 632 ఓట్లు పోలయ్యాయి. వీటిని పది రౌండ్లుగా 42 టేబుళ్లపై లెక్కింపు జరుపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, ఆ తర్వాత 103 హోం ఓటింగ్‌లను లెక్కించిన తర్వాత ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. సాధారణంగా 14 టేబుళ్లపై కౌంటింగ్ జరుగుతుంది. ఉప ఎన్నిక కావడం, ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేసి త్వరగా లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉదయం 8.45 గంటలకల్లా తొలి రౌండ్ ఫలితం వెల్లడి కానుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపే తుది ఫలితాన్ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని మొత్తం 10 రౌండ్లుగా కొనసాగించ నున్నారు. ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల బరిలో 58 అభ్యర్థులతో పాటు నోటాకు పోలైన ఓట్ల సంఖ్యను అధికారులు వెల్లడించనున్నారు. కాగా కౌంటింగ్ కేంద్రంలో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. దీనికితోడు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, సాయుధ బలగాలతో 24గంటల పహారా ఉండనుంది. స్టేడియానికి 100 మీటర్ల మేరలో ఆంక్షలు ఆమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్నిక ఏదైనా మా వైఖరిలో తేడా ఏమీ ఉండదని జూబ్లీహిల్స్ ఓటర్ మరోసారి నిరూపించారు. ప్రతిసారీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలింగ్ 50 శాతానికి మించడం లేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 47.49 శాతం పోలింగ్ నమోదు కాగా.. తాజాగా ఉప ఎన్నికలో 48.49 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇక్కడ కేవలం ఒక్కశాతం మాత్రమే పోలింగ్ శాతం పెరగడం గమనార్హం. ఉప ఎన్నిక సమయానికి నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల ఓటర్లు ఉండగా.. లక్షా 94వేల 631 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. కేవలం 48.49 శాతం పోలింగ్ మాత్రమే నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారులు బుధవారం అధికారికంగా ప్రకటించారు. 99,771 మంది పురుషులు ఓటు వేశారు. బస్తీల్లో ఉండే ఓటర్లు ఓటేసేందుకు ఆసక్తి చూపగా, అపార్ట్‌మెంట్లలో ఉన్న ఓటర్లు చాలావరకు ఓట్లు వేయనట్లు తెలుస్తోంది. మరోవైపు కొత్తగా ఓటుహక్కు వచ్చిన యువత ఓటు వేసేందుకు ఉత్సాహం కనబర్చారు. అయితే పోలింగ్ శాతం తగ్గడానికి కారణాలు లేకపోలేదని విశ్లేషకుల అంచనా.. ప్రైవేట్ ఉద్యోగులకు సెలవులు లేకపోవడం, ఓటింగ్ శాతం పెంచడంలో అధికారుల ప్రచార లోపం, పోలింగ్ బూత్‌ల వరకు ఓటర్లను రప్పించడంలో రాజకీయ పార్టీలు విఫలం అయ్యాయనే ఆరోపణలున్నాయి.

# హైదరాబాద్‌లో హై అలర్ట్

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు**

**పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు**

**హైదరాబాద్,నవంబర్13:** భాగ్యనగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాల్లో హై అలర్ట్ కొనసాగుతోంది. బస్టాండ్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు , శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు.

హోటల్స్‌పై పోలీసులు నిఘా పెంచారు. ఇక.. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం తీవ్ర కలకలం రేపుతున్న విషయం. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది.

ఇటీవల రాజేంద్రనగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు.. పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.÷ూగా... రెండు రోజుల క్రితం ఢిల్లీలో భారీ పేలుడు ఘటన దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద నిలిచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బ్లాస్ట్‌తో దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది.

# దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కన్నీరు

**- కొనుగోలు ధరలు పెరిగినా గిట్టుబాటు మృగ్యం - మార్కెటింగ్ సౌకర్యం లేక ఆందోళన**



**న్యూఢిల్లీ,నవంబర్13:**
దేశవ్యాప్తంగా ఉల్లి పంట పండించిన అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు, కొనడానికి అధికధరలు వెచ్చించి ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఎపిలో కర్నూలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం హడావిడి చేసినా రైతులకు ఒరిగిందేమీ లేదు. చాలా చోట్ల రైతులు ఉల్లి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లితే రవాణా ఖర్చులు కూడా రావడం లేదని, పొలాల్లోనే వాటిని వదిలేస్తున్నారు. కొన్ని మాసాల నుంచే అక్కడి రైతులు మద్దతు ధర కోసం వివిధ రూపాల్లో పోరాడుతూనేవుంది. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో కిలో ఉల్లి మాత్రం 30కి పైనే అమ్ముతున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఇప్పటికే పాత ఉల్లి పంట నిల్వలు ఉండగా..ఇప్పుడు కొత్త పంట కూడా మార్కెట్‌లోకి రావడం, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలకు ఎగుమతులు నిలిపివేయడం వంటి కారణాల మూలాన ధరలు అమాంతం పడిపోయాయి. మంగళవారం కిలో రూ.2కు పడిపోయిన ధరలు బుధవారం రూ.1 కంటే దిగువకు పడిపోయాయి. కనీసం రవాణా ఛార్జీలు కూడా దక్కకపోవడంతో రైతు మార్కెట్‌లోనే కంటతడి పెడుతున్నారు. ఉల్లి ప్రధాన మార్కెట్లలో ఒక్కటైన మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో మంగళవారం కిలో ఉల్లి ధర రూ.2గా ఉంది. బుధవారం మరో ప్రధానమార్కెట్ అయిన మంద్‌సౌర్‌లో కిలో ఉల్లి ధర రూ.1కి, అంతకంటే దిగువకు పడిపోయింది. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. మాల్వాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక రాజస్థాన్‌లోని అల్వార్‌లోనూ ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అక్కడ కూడా కిలో ఉల్లి రూ.1 నుంచి రూ.5 మధ్యనే పలుకుతోంది. నాణ్యత మరీ అధికంగా ఉంటే కిలో రూ.8 చొప్పున కొంటున్నారు. ఇక ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి పాయల మార్కెట్‌గా పేరొందిన మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలోనూ ఉల్లి రైతు గోడు అంతాఇంత కాదు. ÷రిత్త, పాత ఉల్లిపాయల నిల్వలు ఒకేసారి మార్కెట్‌లోకి వచ్చిన నేపథ్యంలోనే ఉల్లి పాయల ధరలు పడిపోయినట్లు ప్రకటించి రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని బిజెపి నేతృత్వ డబుల్ ఇంజిన్ సర్కార్లు చేతులు దులిపేసుకుంటున్నాయి. అన్నదాతలకు కనీస మద్దతు కూడా ఇవ్వకుండా పరిహాసమాడుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి..ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసినా..డబుల్ ఇంజిన్ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరి స్తోంది. దాదాపు ఆరు నెలలుగా తమ ఉత్పత్తులను నిల్వ చేసినప్పటికీ.. సరైన ధర లభించడం లేదని, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వెల్లుల్లి ధరలు కూడా భారీ స్థాయిలో పడిపోవడంతో అక్కడి రైతన్నలు ఆక్రందనకు గురౌతున్నారు. వాతావరణ పరిస్థితులు, నిల్వ చేయడానికి అవసరమైన గోడాన్లు లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి ఉల్లి పంట సాగు చేసే రైతన్నలను సంక్షోభంలోకి నెట్టేశాయని మహారాష్ట్ర స్టేట్ ఆనియన్ ప్రొడ్యూసర్స్ ఫార్మర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు భరత్ డిఘోలే అన్నారు. సంక్షోభ నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రత్లాం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర కేవలం రూ.600గా ఉంది. పొలం నుంచి మార్కెట్‌కు ఉల్లిని తరలించడానికి రవాణాకు అయిన ఖర్చు కూడా రావడం లేదని నగ్రా గ్రామానికి చెందిన ఓ అన్నదాత వాపోయాడు. '30 క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌కు తరలించేందుకు రూ.2 వేలు అయ్యింది. మార్కెట్‌లో అమ్మగా క్వింటాల్‌కు రూ.250లే వచ్చాయి. తీవ్రంగా నష్టపోయాం' అని దుంఖం నిండిన కళ్లతో ఆ రైతు అన్నారు.

# ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు

**- ముంబై -వారణాసి విమానాన్ని అత్యవసర ల్యాండింగ్**

**- 182 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడటం ఊరటనిచ్చింది**

(వారణాసి, నవంబర్ 13)
దేశంలో బాంబు బెదిరింపుల శృంఖల మరింత ఆందోళన కలిగిస్తున్న వేళ, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి వచ్చిన తాజా బెదిరింపు అధికారులు అప్రమత్తం అయ్యేలా చేసింది. సాయంత్రం ముంబై నుంచి వారణాసికి వెళుతున్న %×ఠ% 1023 విమానానికి గాల్లో ప్రయాణిస్తున్న సమయంలోనే బాంబు బెదిరింపు సందేశం అందింది. అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన అన్ని భద్రతా నియమావళిని అమలు చేస్తూ పైలట్ వెంటనే ల్యాండింగ్‌కు సిద్ధమయ్యారు. వారణాసి విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా దిగారు. విమానంలో 182 మంది ప్రయాణికులు ఉన్నారని, వారందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో ఎవరికి చిన్నపాటి గాయాలు కూడా కాలేదని సమాచారం. విమానాన్ని ల్యాండ్ చేసిన వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, %జ×ూఖీ% భద్రతా బలగాలు గట్టిగా తనిఖీలు చేపట్టాయి. బాగేజీలు, కేబిన్, కార్గో సెక్షన్లను పూర్తిగా పరిశీలించిన అనంతరం ఏ అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. అయినప్పటికీ బెదిరింపు సందేశం ఎలా వచ్చింది, దాని వెనుక ఉద్దేశ్యం ఏమిటన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బెదిరింపు సందేశం పంపిన వ్యక్తిని గుర్తించేందుకు




సాంకేతికంగా అన్ని కోణాల్లో విచారణ ప్రారంభించారు. ఇటీవల దేశంలో పలుచోట్ల బాంబు బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో విమానాశ్రయ భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని కేంద్ర పౌర విమానయాన విభాగం అధికారులను ఇప్పటికే ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రయాణికులు సురక్షితంగా బయటపడటం సంతోషకరమైనప్పటికీ, బెదిరింపు పట్ల అధికారులు ఇంకా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రెండు లారీల మధ్య నలిగిన కారు... చెలరేగిన మంటలు

**- ఘోర అగ్నిప్రమాదంలో 8 మంది మృతి - 15 మంది గాయాలు - కొందరి పరిస్థితి విషమం**



**(పూణే, నవంబర్ 13)**
మహారాష్ట్రలోని పూణే%-%బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపు తప్పిన కంటైనర్ లారీ పలు వాహనాలపైకి దూసుకెళ్లి, మరో లారీని ఢీకొట్టడంతో మధ్యలో ఉన్న కారు పూర్తిగా నలిగిపోయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు మొత్తం 8 మంది దుర్మరణం చెందినట్లు అధికారులు తెలిపారు. నవాలే వంతెన సమీపంలో జరిగిన ఈ ఘటనలో మంటలు విపరీతంగా వ్యాపించడంతో కారులో ఉన్నవారు బయటపడే అవకాశం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చినా, అప్పటికే ప్రాణనష్టం సంభవించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో సుమారు 15 మంది గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించగా, కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం అత్యంత రద్దీగా ఉండడం వల్ల భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించాయి. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. త్వరిత రవాణా, అధిక వేగం, నియంత్రణ కోల్పోవడం వంటి అంశాలు ఇటువంటి ప్రమాదాలకు కారణమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పూణే హైవేలో జరిగిన ఈ ఘటన స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది.

# కారు తనిఖీ చేసిన పోలీసులు... డిక్కీలో నిద్రిస్తున్న వ్యక్తిని చూసి షాక్

**- పేలుడు ఘటన తర్వాత కట్టుదిట్టమైన తనిఖీలు - సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో - నెటిజన్ల హాస్య కామెంట్లు వెల్లువ**



**(న్యూఢిల్లీ, నవంబర్ 13)**
దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన కారు పేలుడు ఘటన తర్వాత భద్రతా విభాగాలు అప్రమత్తమయ్యాయి. అన్ని చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు కఠినతరం చేస్తున్న పోలీసులు, ఒక కారును ఆపి సాధారణ తనిఖీ చేపట్టగా ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ కారు డిక్కీ తెరిచిన అధికారులు అందులో ఓ వ్యక్తి నిద్రిస్తుండటం చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు దేశవ్యాప్తంగా కలకలం రేపిన నేపథ్యంలో సిగ్నేచర్ బ్రిడ్జ్ చెక్‌పాయింట్ వద్ద తిమార్పూర్ పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారును ఆపారు. ప్రయాణికులు నవ్వుతూ కిందకు దిగినా, విచిత్ర దృశ్యం డిక్కీ తెరిచినప్పుడు బయటపడింది. కారులో సీట్లు అందుబాటులో లేకపోవడంతో బంధువైన ఓ వ్యక్తి డిక్కీలో సర్దుకుని పడుకున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడు లోపలే నిద్రపోయిన సంగతి వారికి తెలియకుండా ప్రయాణం సాగుతుండటమే ఈ ఆసక్తికర పరిస్థితికి కారణమైంది. పోలీసులు అతడిని హెచ్చరించి, ఇకపై ఇలాంటి ప్రమాదకర ప్రయాణం చేయొద్దని సూచించి వదిలేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయ్యింది. నెటిజన్లు ఫన్నీ మీమ్స్, కామెంట్లతో పోస్ట్‌ను ట్రెండింగ్‌లోకి నెట్టారు. పేలుడు ఘటనతో సున్నితమైన భద్రతా పరిస్థితుల్లో జరిగిన ఈ సరదా సంఘటన ఒక్కరోజు పాటు చర్చనీయాంశమైంది.

# "చంద్రబాబు ఇంకా నా ఆశీస్సులు తీసుకోలేదు"

**కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు - మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై ఘాటు విమర్శలు**



హైదరాబాద్, నవంబర్ 13
ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యంగా మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. ఈ విధానం పబ్లిక్%-%ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ కాదని, వాస్తవానికి "పీపీబీ బిలియనీర్ల ప్రోగ్రామ్" అని అభివర్ణిస్తూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తానని ప్రకటించారు. మెడికల్ కాలేజీలను ఎవరికైనా అప్పగించినా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. పీపీపీ పద్ధతిపై తీవ్ర భిప్రాయంతో తాను ఇప్పటికే హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశానని పాల్ స్పష్టం చేశారు. కర్ణాటకలో ఇదే విధానంతో వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని గుర్తుచేశారు. "ప్రభుత్వ ఆస్తులను 33 ఏళ్ల లీజు పేరుతో అమ్మేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అమ్మినట్టే ఇప్పుడు మెడికల్ కాలేజీలు కూడా కట్టబెడుతున్నారు. క్యూబా లాంటి చిన్న దేశం ఉచిత విద్య, వైద్యం ఇస్తుంది%ొ% మన దగ్గర ఎందుకు కాదు?" అని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై కూడా పాల్ తీవ్రంగా స్పందించారు. "గత ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పవన్ ఇప్పుడు ఎక్కడ? సుగాలి ప్రీతి దారుణంపై ఎందుకు మౌనం?" అని ప్రశ్నించారు. విశాఖపట్నం సమ్మిట్‌లో లక్ష కోట్ల పెట్టుబడుల వాదనపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల కేటాయింపుల ముసుగులో పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగాయనే అనుమానం వ్యక్తం చేసిన పాల్, "ప్రధాని, ముఖ్యమంత్రికి రూ.5 వేల కోట్లు ముడుపులు అందకుండానే నారాయణ లాంటి వారికి మెడికల్ కాలేజీలు ఇస్తారా?" అని ప్రశ్నించారు. తాను అనుమతులు రానందున నిధులు తెచ్చుకోలేకపోతున్నానని, ఒకసారి ప్రభుత్వం సంతకం చేస్తే రెండు వారాల్లో రూ.5 వేల కోట్లు తెస్తానని ఘాటుగా సవాలు విసిరారు. స్టీల్ ప్లాంటు అమ్మకంపై అదానీ తనను కలిసినట్లు పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన పిల్ హైకోర్టులో కొట్టివేతకు గురైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. "జగన్ నన్నెప్పుడూ ఇబ్బంది పెట్టలేదు%ొ% కానీ చంద్రబాబు ఇప్పటికి నా ఆశీస్సులు తీసుకోలేదు" అని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

# ఢిల్లీ పేలుళ్లపై అనుచిత పోస్టులు

**అసోంలో 15 మంది అరెస్ట్**

**- విద్వేషాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు**

**- హింసను కీర్తిస్తే ఉపేక్ష లేదు ... సీఎం హిమంత బిశ్వ శర్మ హెచ్చరిక**

**(గువాహటి, నవంబర్ 13)**



దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుళ్లు దేశాన్ని కలచివేశాయి. 12 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ దారుణ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర స్పందనలు వినిపిస్తున్న తరుణంలో, సోషల్ మీడియాలో కొందరు మాత్రం పేలుళ్లను కీర్తిస్తూ, అనుచితంగా, అవమానకరంగా పోస్టులు పెట్టారు. ఇటువంటి విద్వేషపూరిత వ్యాఖ్యలను అసోం ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి రాష్ట్రవ్యాప్తంగా 15 మందిని అరెస్టు చేసింది. సీఎం హిమంత బిశ్వ శర్మ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. "ఢిల్లీ పేలుళ్లపై అవమానకర పోస్టులు పెట్టినందుకు ఇప్పటివరకు 15 మందిని అరెస్టు చేశాం. నిన్న రాత్రి మరో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా మొత్తం సంఖ్య 15కు చేరింది" అని శర్మ ఎక్స్‌లో ప్రకటించారు. విద్వేషాన్ని, హింసను ప్రోత్సహించే ఏ చర్యనైనా అసోం పోలీసులు కఠినంగా ఎదుర్కోవాలని ఆయన స్పష్టం చేశారు. అరెస్టయిన వారిలో బొంగైగావ్‌కు చెందిన రఫీజుల్ అలీ, హైలకండికి చెందిన ఫరీదుద్దీన్ లస్కర్, లఖింపూర్ జిల్లా నివాసితులు ఇనాముల్ ఇస్లాం, ఫిరోజ్ అహ్మద్, బార్పెట్టాకు చెందిన షాహిల్ షోమన్ సిక్దార్, రకీబుల్ సుల్తాన్, హోజైకి చెందిన నసీమ్ అక్రమ్, కమ్రూప్‌కు చెందిన తస్లిమ్ అహ్మద్, దక్షిణ సల్మారాకు చెందిన అబ్దుర్ రోహిమ్ మొల్లా వంటి పేర్లను సీఎం వెల్లడించారు. దేశ భద్రతకు సంబంధించిన విషాదకర ఘటనలను కీర్తించడం, బాధితులను అవమానించే పోస్టులు పెట్టడం సమాజంలో విద్వేషం, అసహనం పెంచుతుందని హెచ్చరించిన సీఎం, ఇటువంటి చర్యలను ఏ విధంగానూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. "హింసను కీర్తిస్తే రాజీ లేదు సమాజాన్ని రెచ్చగొట్టే వారిపై తీవ్రమైన చర్యలు తప్పవు" అని హితవు పలికారు.

# బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

**- ఇద్దరు కార్మికుల మృతి, ఐదుగురికి గాయాలు**

**- భద్రతా ప్రమాణాల లోపమే కారణమని అనుమానం**

(లక్నో, నవంబర్ 13)



ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాలో గురువారం మధ్యాహ్నం బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి ప్రాంతం అంతా ఒక్కసారిగా కల్లోలం నెలకొంది. పలు కిలోమీటర్ల దూరం వరకూ పేలుడు శబ్దం వినిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘటనలో ఇద్దరు వర్కర్లు మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన కార్మికులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల వివరాలను అధికారులు ప్రకటన చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ బాణసంచా కర్మాగారానికి లైసెన్స్ ఉన్నప్పటికీ, భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం చోటుచేసుకుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేలుడు సమయంలో యజమాని ఖలీద్‌తో పాటు అతని సోదరుడు కూడా అక్కడే ఉండగా, వారు గాయపడ్డట్లు పోలీసులు తెలిపారు. నిర్వాహకుల అజాగ్రత్త, ప్రమాదకర పదార్థాల తగిన విధంగా నిర్వహణలో లోపాలే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమిక దర్యాప్తులో బయటపడుతోంది. సంఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఫ్యాక్టరీలోని భద్రతా పరిస్థితులను పూర్తిగా సమీక్షించనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# మాస్కులు కూడా సరిపోవు

**- ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన**

**- వర్చువల్ విచారణలను వినియోగించుకోండి**

**- జస్టిస్ పీఎస్ నరసింహ సూచన**

(న్యూఢిల్లీ, నవంబర్ 13)
దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ ప్రమాదకర స్థాయికి చేరి ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రమైన ముప్పులోకి నెట్టింది. గాలి నాణ్యత సూచిక వరుసగా 400 దాటుతూ సీవియర్ కేటగిరీలో కొనసాగుతుండటంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "ప్రస్తుతం ఢిల్లీలోని గాలి పరిస్థితి అంత ప్రమాదకరం అయింది కాబట్టి సాధారణ మాస్కులు కూడా మనల్ని రక్షించలేవు" అని జస్టిస్ పీఎస్ నరసింహ వ్యాఖ్యానించారు. గత కొన్ని రోజులుగా పొగమంచు, దుమ్ము, పరిశ్రమల కాలుష్యం, వాహనాల ఉద్గారాలు, పంట అవశేషాల దహనం వంటి అంశాలు రాజధాని వాతావరణాన్ని మరింత విషపూరితంగా మార్చాయి. పాఠశాలల్లో పిల్లలకు శ్వాస సమస్యలు, వృద్ధుల్లో ఆస్థమా, బ్రోంకైటిస్ కేసులు పెరగటం వైద్యులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వర్చువల్ విచారణ సౌకర్యం అందుబాటులో ఉన్నప్పటికీ కొందరు సీనియర్ న్యాయవాదులు ఇంకా కోర్టుకు స్వయంగా వస్తున్నారని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. "మీ వద్ద ఇప్పటికే వర్చువల్ సదుపాయం ఉంది%ొ% ఈ స్థాయి కాలుష్యంలో ఇంకా ఎందుకు కోర్టుకు వస్తున్నారు? గాలి ఇంత ప్రమాదకరంగా ఉన్నప్పుడు మీ ఆరోగ్యానికి ఇది హానికరం" అని ఆయన సూచించారు. కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతున్న సమయంలో అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమస్యపై ప్రధాన న్యాయమూర్తితో సమగ్రంగా చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో వాయు నాణ్యతా నిర్వహణ కమిషన్ కూడా అత్యవసర చర్యలుగా పారిశ్రామిక ఉద్గార నియంత్రణ, వాహన రాకపోకలపై పరిమితులు, నిర్మాణ పనుల నిలిపివేత వంటి ప్రాథమిక చర్యలు ప్రారంభించింది. ఇటువంటి తీవ్ర పరిస్థితుల్లో ఢిల్లీ వాతావరణంపై సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రజల్లో అవగాహన పెంచడమే కాక, కాలుష్యం నియంత్రణకు ప్రభుత్వాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి.

# పొట్ట నింపని పత్తి

**దిగుబడి రాకపోవడంతో చేలు దున్నేస్తున్న పత్తి రైతులు**
**ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, ఇతర పంటలు**
**ఖరీఫ్ సీజన్‌లో పత్తి రైతులను ముంచిన అధిక వర్షాలు**
**దారుణంగా దెబ్బతిన్న పంట.. దిగుబడి లేక దిగాలు**
**ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు కూడా రాని వైనం**
**మొక్కజొన్నతో ఎంతోకొంత గిట్టుబాటు అవుతుందన్న ఆశ**



**హైదరాబాద్, నవంబరు 13:**
పత్తి రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి అష్టకష్టాలు పడిన రైతన్నలు.. మరిన్ని నష్టాలను భరించలేమన్న విషయాన్ని గ్రహించారు. పత్తితో లాభం లేదనుకొని.. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల వైపు దృష్టి పెట్టారు. పంటకాలం పూర్తికాకముందే పత్తి చేనును పీకేసి, అదే భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ వానాకాలంలో భారీ వర్షాలతో పత్తి పంట దెబ్బతినడం, భవిష్యత్తులో కోలుకొని దిగుబడి వస్తుందనే భరోసా లేకపోవడంతో రైతులు పత్తి మొక్కలు పీకేస్తున్నారు. కొందరు రెండోసారి పత్తి తీశాక మొక్కలను పీకేస్తుండగా.. మరికొందరు ఒక్కసారి పత్తి తీసిన వెంటనే ప్రత్యామ్నాయ పంటను ఎంచుకుంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నల్లరేగడి భూముల్లో వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 10–12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చెలక నేలలు, తేలికపాటి భూముల్లో 4–5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మధ్యస్థ భూములు అయితే 6–7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పత్తి దిగుబడి సగటు చూస్తే ఎకరాకు 7 క్వింటాళ్ల వరకు ఉంటుంది. కానీ, ఈసారి ఆ పరిస్థితి లేదు. జూన్, జూలైల్లో కాస్త తక్కువ వర్షాలు పడినా, ఆగస్టు నుంచి కుండపోత వర్షాలు కురవడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో పడే వర్షాలతోపాటు అకాల వర్షాలు, తుపాన్ల ప్రభావంతో పత్తి పంట కోలుకోలేని విధంగా తయారైంది. దిగుబడి పూర్తిగా పడిపోయింది. పత్తి సాగుకు కేంద్రబిందువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కూడా 8–10 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. జిల్లాలో అసాధారణ స్థాయిలో 1,540 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో పత్తి తీవ్రంగా దెబ్బతింది. వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో కూడా పత్తి పంట పరిస్థితి ఇలాగే తయారైంది.

### ఒకటి, రెండు సార్లు పత్తి తీయగానే..

సాధారణంగా పత్తి పంట ఏడాది పాటు సాగులో ఉంటుంది. జూన్‌లో మొదలైతే మార్చి నెలాఖరు వరకు ఉంచినా పత్తి దిగుబడి వస్తుంది. అయితే, రైతులు జూన్ నుంచి డిసెంబరు వరకు పక్కాగా ఉంచుతారు. జనవరి నుంచి మార్చి వరకు కొందరు రైతులు పత్తి చెట్లు తీసేసి.. ఇతర పంటలు వేస్తుంటారు. మార్చి వరకు పంటను ఉంచి నీళ్లు, ఎరువులు అందిస్తే.. పూత, కాతతో మళ్లీ 3–4 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఖరీఫ‌లో అలాంటి పరిస్థితి లేదు. నవంబరు మొదటి పక్షంలోనే రైతులు పత్తి చేను తీసేసి, నేలను చదును చేస్తున్నారు. పెద్దగా దిగుబడి రాని పంటను నాలుగైదు నెలలు ఉంచడం ఎందుకన్న ఆలోచనతో పత్తి తీసేస్తున్నారు. వర్షాల తాకిడికి చెట్లు పెరగకపోవడం, ఆకులు ముడతపడడం, కాయలు నల్లబడడంతో పత్తి మొక్కలను తీసేయడమే మేలన్న నిర్ణయానికి వచ్చారు. ఒకటి, రెండు సార్లు పత్తి తీసే స్థాయుల్లోనే చేనును దున్నేస్తున్నారు. అదే భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కొందరు రైతులు శనగ, పెసర, ఇతర పంటలు కూడా వేస్తున్నారు. సాధారణంగా మొక్కజొన్న సాగుకు ప్రత్యేక సీజనేమీ ఉండదు. నీటి వసతి ఉంటే ఎప్పుడైనా వేసుకోవచ్చు. దీంతో రైతులు పత్తి చేనును తొలగించి, మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని సింహభాగం పత్తి రైతులు ఇదే పని చేస్తున్నారు. పత్తి పంటకు ఎకరానికి రూ.36–46 వేల వరకు పెట్టుబడి ఖర్చవుతోంది. ఆయా జిల్లాల్లో 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే తప్ప ఎంతో కొంత మిగిలే పరిస్థితి లేదు. ఇప్పుడు అందులో సగం కూడా దిగుబడి రావడం లేదు.

### డిసెంబరు 31 నాటికి ముగించడమే మేలు

పత్తి పంటను ఆరు నెలల్లో (డిసెంబరు 31 నాటికి) ముగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతంలో గులాబీ పురుగులు లేని సమయంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు పత్తి చేనును ఉంచినా ఇబ్బంది ఉండేది కాదు. నీటి వసతి, ఎరువులు వేస్తే సరిపోయేది. కానీ, కొంతకాలంగా గులాబీ రంగు పురుగు పత్తి పంటకు కొరకరాని కొయ్యలా తయారైంది. చలికాలం మొదలవగానే గులాబీ పురుగు తీవ్రత పెరుగుతోంది. నష్టశాతం కూడా పెరిగిపోయింది. మందులు కొడుతున్నా తగ్గే పరిస్థితి లేదు. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ వరకు పత్తి సాగును పొడిగిస్తే.. కాయలు పుచ్చుపట్టి పోతాయే తప్ప ఫలితం ఉండదని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రాంప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. డిసెంబరు నెలాఖరు నాటికి పత్తి పంటను ముగించి.. ప్రత్యామ్నాయ, ఆరు తడి పంటలు వేసుకోవాలని తెలిపారు. అదేక్రమంలో నవంబరు 20లోపు మొక్కజొన్న విత్తనాలు వేస్తే యాసంగి సీజన్‌లో దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు.


### మూడెకరాల్లో పత్తి తీసి మొక్కజొన్న వేశా

**కూరపాటి రమణ, అనంతసాగర్, ఖమ్మం జిల్లా**
ఈ ఖరీఫ‌లో మూడెకరాల్లో పత్తి సాగు చేశా. అధిక వర్షాలకు పంట ఎర్రబారిపోయింది. పత్తి కాయలు నల్లగా మారాయి. ఎకరానికి 3 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. కాలపరిమితి ముగిసేవరకు పంట ఉంచినా లాభం లేదని అనిపించింది. అందుకే పత్తి మొక్కలను పీకేసి, అదే భూమిలో మొక్కజొన్న విత్తనాలు వేశా. పత్తి సాగుతో తీవ్రంగా నష్టపోయా. పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. పత్తిపంటను దున్నేసి మొక్కజొన్న వేయడం ద్వారా యాసంగిలో అయినా ఎంతో కొంత గిట్టుబాటు అవుతుందని ఆశిస్తున్నా.

# 32 కార్లు.. 8 మానవ బాంబులు

## దేశంలో అసాధారణ విధ్వంసానికి ఉగ్రవాదుల కుట్ర

- ఐఈడీల తయారీకి 26 క్వింటాళ్ల ఎరువుల కొనుగోలు
- దేశంలో 8 చోట్ల ఏకకాలంలో దాడులకు ప్రణాళిక - రూ.20 లక్షలు సేకరించి ఉమర్ నబీకి అందజేత
- టర్కీలో ఉకాసా అనే వ్యక్తితో తరచూ సంభాషణ - అరెస్టయిన డాక్టర్లంతా ఆత్మాహుతి బాంబర్లే!



**న్యూఢిల్లీ, నవంబరు 13:** దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో విధ్వంసం సృష్టించేందుకు ఫరీదాబాద్ ఉగ్రవాద ముఠా ప్రణాళిక సిద్ధం చే సినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు గుర్తించారు. ఏకంగా 32 కార్లలో బాంబులు అమర్చి, 8 ప్రధాన ప్రాంతాల్లో ఏకకాలంలో ఆత్మాహుతి దాడులు చేయాలని ఈ మాడ్యూల్ కుట్ర పన్నింది. ప్రధానంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లను లక్ష్యంగా ఎంచుకున్నారు. వీరి కుట్రకు హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ వేదిక అయ్యింది. ముఖ్యంగా యూనివర్సిటీ క్యాంప‌స‌లోని 17 భవనంలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లోని 13వ నంబర్ గదిని ఉగ్ర స్థావరంగా మార్చుకున్నట్లు గుర్తించారు. ఈఉగ్రవాద వైద్యులు టర్కీలోని ఉకాసా అనే వ్యక్తితో తరుచూ సంభాషించారు. ఆ ఉకాసా ఎవరన్నదానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. హ్యాండ్లర్‌తోపాటు ఈ ముఠా సభ్యులు పరస్పరం సంభాషించుకునేందుకు స్విట్జర్లాండ్‌కు చెంది న త్రీమా యాప్‌ను ఉపయోగించినట్లు గుర్తించారు. కాగా, సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడిలో మృతుల సంఖ్య13కు చేరిం ది. ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో గురువారం ఒకరు మరణించాడు.

### బాంబుల కోసం 26 క్వింటాళ్ల ఎరువు

ఫరీదాబాద్ ఉగ్రవాదులు మహా విధ్వంసానికే కుట్ర పన్నారు. 8 మంది నాలుగు గ్రూపులుగా విడిపోయి, ఏక కాలంలో 32 కార్లలో బాంబులు అమర్చి పేల్చివేయాలని ప్రణాళిక వేశారు. అందుకోసం మొత్తం పాత కార్లనే కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే నాలుగు కార్లను సమకూర్చుకున్నారు. ఎర్రకోట వద్ద పేలింది అందులో ఒకటే. ఎరుపు రంగు ఎకోస్పోర్ట్ కారును బుధవారం హరియాణాలోని ఓ గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. అందులో నిద్రిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ముజమ్మిల్ వాడిన బ్రెజా (హెచ్ఆర్87 యూ9988) కారును యూనివర్సిటీ క్యాంప‌సలోకనుగొన్నారు. డాక్టర్ షహీన్ సయీద్ వాడిన స్విఫ్ట్ డిజైర్ కారును గతంలోనే స్వాధీనం చేసుకోగా, అందులో ఓ అసాల్ట్ రైఫిల్ లభించింది. ఈ కార్లలో అమర్చేందుకు ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్ (ఐఈడీ) బాంబులను తయారు చేసేందుకు రూ.3 లక్షలతో గురుగ్రామ్, నూహ్ తదితర చోట్ల నుంచి 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువులను కొనుగోలు చేసినట్లు తేలింది. బాంబుల తయారీ, దాడుల కోసం డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ అదీల్, డాక్టర్ షహీన్ సయీద్, డాక్టర్ ఉమర్ నబీ కలిసి రూ.20 లక్షలు సేకరించి, ఆ డబ్బును నబీ వద్ద దాచినట్లు గుర్తించారు. ఎర్రకోట బాంబు దాడిలో అతడు కూడా మర ణించిన విషయం తెలిసిందే. ఈ డబ్బు విషయంలో ముజమ్మిల్, ఉమర్ మధ్య అభిప్రాయ బేధాలు వచ్చినట్లు కూడా అధికారుల విచారణలో తేలింది. అరెస్టయిన డాక్టర్లంతా ఆత్మాహుతి బాంబర్లుగా మారాలని నిర్ణయించుకున్నట్లు గుర్తించారు.

### అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో

జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పోస్టర్లు వేసి దొరికిపోయిన ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్ వెనుక అత్యంత ప్రమాదకరమైన అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్ ఉన్నట్లు భారత దర్యాప్తు, నిఘా వర్గాలు గుర్తించాయి. మొదట ఈ మాడ్యూల్‌ను తేలిగ్గా తీసుకున్న పోలీసులు.. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడి తర్వాత లోతుగా శోధిస్తుండటంతో నిఘా వర్గాలే ఉలిక్కిపడే కుట్ర బయటపడుతోంది. టర్కీలో తిష్ట వేసిన పాకిస్థాన్ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ నాయకులు.. అక్కడి నుంచి ఫరీదాబాద్ మాడ్యూల్‌ను నడిపించినట్లు గుర్తించారు. ముఖ్యంగా ఉకాసా అనే పేరుతో ఉన్న వ్యక్తి ఈ మాడ్యూల్‌కు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చినట్లు తేలింది. అరబ్బీలో ఉకాసా అంటే సాలీడు అని అర్థం. ఢిల్లీలో ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీతోపాటు ఈ వైద్యుల ముఠాను తయారుచేసిన జమ్ముకశ్మీర్‌కు చెందిన ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ గతంలో టర్కీలో రెండువారాలు ఉండి వచ్చినట్లు గుర్తించారు. వారు ఉకాసాను కలిసి ఉంటారన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

### రూమ్ నంబర్ 13.. ఉగ్రడెన్

హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీలో జరుపుతున్న సోదాల్లో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దాదాపు 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ వర్సిటీని ఉగ్రవాదులు తమ డెన్‌గా మార్చుకున్నట్లు తేలింది. ముఖ్యంగా 17వ భవనంలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లో 13వ నంబర్ గది ఉగ్ర స్థావరంగా మారింది. పోలీసులు అరెస్టు చేసిన డాక్టర్ ముజమ్మిల్ ఆ గదిలో ఉండేవాడని గుర్తించారు. ఈ ఉగ్రముఠా మొత్తం ఈ గదిలోనే తరచూ సమావేశమై దాడులకు ప్రణాళిక రూపొందించినట్లు తేలింది. ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ ఇదే హాస్టల్‌లో 4వ నంబర్ గదిలో ఉండేవాడని, ఆ గ దిలో కూడా ఈ ఉగ్ర డాక్టర్లు సమావేశం అయ్యేవారని పోలీసులు తెలిపారు. క్యాంప‌స‌లో ఇంకా ఎవరెవరు ఈ ముఠాలో సభ్యులుగా చేరారన్నదానిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు అరెస్టు చేసిన మహిళా ఉగ్రవాది, అల్ ఫలాహ్ వర్సిటీ మెడికల్ కాలేజీ డాక్టర్ షహీన్‌కు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు స్పష్టమైంది.

### అల్ ఫలాహ్ వర్సిటీ స్థాపకుడి అక్రమాలెన్నో..

దేశవ్యాప్తంగా భారీగా పేలుళ్లకు కుట్ర పన్నిన ఉగ్ర వైద్యులకు అడ్డాగా మారిన అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్ధిఖీ అక్రమాలు బయటికి వస్తున్నాయి. భారీగా లాభాలు వస్తాయంటూ రూ.7.5 కోట్లు డిపాజిట్లు సేకరించి, మోసం చేసిన కేసులో ఆయన మూడేళ్లు జైలుకు వెళ్లిన అంశం చర్చనీయాంశంగా మారింది. అల్ ఫలాహ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి.. ఆ సొమ్మును వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించారు సిద్ధిఖీ. దీనిపై నమోదైన కేసులో 2001 మార్చిలో అతడు అరెస్టయ్యారు. బాధితులకు సొమ్ము తిరిగిస్తానని ఢిల్లీ హైకోర్టుకు హామీ ఇవ్వడంతో 2004 ఫిబ్రవరిలో బెయిల్‌పై విడుదలయ్యారు. డిపాజిట్ల సేకరణ వ్యవహారంపై ఈడీ కూడా దర్యాప్తు చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా అంబేద్కర్ నగర్‌కు చెందిన సిద్ధిఖీ.. అల్ ఫలాహ్ చారిటబుల్ ట్రస్టు కింద తొమ్మిది సంస్థలను స్థాపించారు. ఇవన్నీ కూడా ఢిల్లీలోని జామియా నగర్‌లో అల్ ఫలాహ్ హౌజ్ పేరిట ఉన్న ఒకే భవనం చిరునామాతో రిజిస్టర్ చేశారు. ఇందులో యూనివర్సిటీ తప్ప మిగతా సంస్థలన్నీ 2019 ఏడాది వరకే కొనసాగాయి. తర్వాత కొన్నింటిని మూసేయగా, మరికొన్నింటిని పక్కనపెట్టేశారు. ఇదిలా ఉండగా, అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీకి 'న్యాక్ (జాతీయ మదింపు, గుర్తింపు మండలి)' నోటీసులు జారీ చేసింది. వర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్, ఉపాధ్యాయ విద్య కాలేజీలకు న్యాక్ నుంచి ఎలాంటి గుర్తింపు లేకున్నా.. న్యాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు ఉన్నట్టుగా వెబ్‌సైట్లో పేర్కొన్నారని వెల్లడించింది.


# పెట్టుబడుల పండగ

- నేడు, రేపు విశాఖలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు - ఉప రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభం
- గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తల హాజరు

**విశాఖపట్నం**
రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ, విదేశాల నుంచి మంత్రులు, దిగ్గజ కంపెనీలు తరలివస్తున్న ఈ సదస్సును శుక్రవారం ఉదయం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభిస్తారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్, ఇంకా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు పారిశ్రామిక దిగ్గజాలు, సీఐఐ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు. సదస్సులో ప్రధాన వేదిక (హాల్ నంబర్ 5)గా ఏపీ ప్రభుత్వ పెవిలియన్ ప్లీనరీ ఉంటుంది. మరో ఏడు హాళ్లలో వేర్వేరుగా సదస్సులు, గోష్ఠుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సీఎం, కేంద్ర వాణిజ్య మంత్రికి చాంబర్లు, శంకుస్థాపనకు ఒక హాలు సిద్ధం చేశారు. ప్రధాన వేదికపై ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. తొలిరోజు రాత్రి 8 గంటల వరకూ పలు ప్లీనరీలు నిర్వహించనున్నారు. రెండోరోజు శనివారం ఉదయం 9.30 గంటలకు తిరిగి ప్లీనరీలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 గంటల నుంచి 5.45 గంటల వరకూ జరగనున్న ముగింపు సభ ఉంటుంది. ఈ సదస్సుఉ 35 దేశాలకు చెందిన మంత్రులు, ప్రతినిధులు పాల్గొంటున్నారు. భాగస్వామ్య సదస్సులో పారిశ్రామిక సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం విశాఖ నోవాటెల్ హొటల్‌లో చంద్రబాబు సమక్షంలో పరిశ్రమల శాఖ తొమ్మిది, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మూడు, ఇంధన శాఖ ఆరు, సీఆర్‌డీఏ 8 ఒప్పందాలు చేసుకున్నాయి. ఆహార శుద్ధి రంగంలో మరో 4 ఒప్పందాలు కుదిరాయి. కాగా, శుక్రవారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రధాన వేదిక వద్ద పరిశ్రమల శాఖ నుంచి 14, ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ 15, ఆహార శు ద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) ఆరు, ఇంధన శాఖ నుంచి 21 ఒప్పందాలు జరగనున్నాయి. మొత్తం ఒప్పందాల మేరకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ ప్రధాన వేదిక (హాల్ నంబరు–5)పై ముందువరుసలో 21 మంది వరకు ఆశీనులవుతారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు పీయూశ్ గోయల్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, టీజీ భరత్, నాదెండ్ల మనోహర్, సీఐఐ అధ్యక్షుడు రాజేంద్ర మోమాని, ఉపాధ్యక్షురాలు సుచిత్ర ఎల్లా, డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, జీఎంఆర్ గ్రూపు చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు తదితరులు కూర్చుంటారు.

# ఆహ్వానితులకు మాత్రమే ప్రవేశం

## దర్శకుడు రాజమౌళి వీడియో ప్రకటన




ప్రిన్స్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఎసెస్ఎంబి సినిమాకు సంబంధించిన ఈవెంట్ ఉంటుందా ఉండదా? అనే చర్చ రెండు రోజులుగా జరుగుతోంది. వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టుకుని జియో హాట్ స్టార్ తో ఈ ఈవెంట్ ను రాజమౌళి బృందం ఎ÷-లాన్ చేసింది. నవంబర్ 15వ తేదీకి ఈ మూవీపై హైప్ పెంచుతూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ వస్తోంది. ఇప్పటికే శ్రుతీహాసన్ పాడిన పాటను రివీల్ చేసిన టీమ్, తాజాగా ప్రియాంక చోప్రా లుక్ ను సైతం విడుదల చేసింది. ఇదిలా ఉంటే... ఢిల్లీలో జరిగిన బాంబ్ బ్లాస్ నేపథ్యంలో గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ ఉండకపోవచ్చుననే ప్రచారం రెండు రోజులుగా జరుగుతోంది. దీనికి రాజమౌళి తెర దించారు. ఖచ్చితంగా ఈ వేడుక ఉంటుందని హామీ ఇచ్చారు. కాకపోతే... ఇది పబ్లిక్ ఫంక్షన్ కాదని, కేవలం ఆహ్వానితులకు మాత్రమే అక్కడ ప్రవేశం ఉంటుందని, రామోజీ ఫిల్మ్ సిటీకి ఎవరు ఏ మార్గం గుండా రావాల్సి ఉంటుందనే విషయంలో రాజమౌళి ఓ వీడియో ద్వారా వివరించారు. పోలీసు శాఖ విధించిన ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని తాము కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు రాజమౌళి తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు, పెద్ద వారికి ఈ ఈవెంట్ లో పాల్గొనే అవకాశం లేదని స్పష్టం చేశారు. వారంతా జియో హాట్ స్టార్ లో చూసి ఆనందించవచ్చని చెప్పారు. రామోజీ ఫిల్మ్ సిటీ మెయిన్ గెట్ ను నవంబర్ 15వ తేదీ మూసి వేస్తున్నారని, దానికి ముందు, దాని తర్వాత ఉన్న మార్గాల ద్వారా ఈవెంట్ కు ఆహ్వానితులు రావాల్సి ఉంటుందని, వీలైనంత ముందుగా వస్తే మంచిదని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు క్రమశిక్షణతో మెలగకపోతే కార్యక్రమం రద్దు అయ్యే ఛాన్స్ కూడా ఉందని రాజమౌళి పరోక్షంగా హెచ్చరించారు. సో... మహేశ్ బాబు అభిమానులు, సినిమాను ప్రేమించే వారు ఏ రీతిన ఈ కార్యక్రమంలో పాల్గొని, ఏ స్థాయిలో దీనిని విజయ వంతం చేస్తారో చూడాలి.

# ధర్మేంద్ర ఇంటిముందు మీడియా

## ఆగ్రహం వ్యక్తం చేసిన తనయుడు సన్నీ

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ మీడియాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన తన సహనాన్ని కోల్పోయి .. నోటి మాట జారారు. ముంబైలోని ఇంటి ముందు వేచి చూస్తున్న మీడియా, ఫోటోగ్రాఫర్లపై అసహనాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ నటుడు ధర్మేంద్ర ప్రస్తుతం ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. బ్రీచ్ క్యాండీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ధర్మేంద్రకు ఇంటి వైద్యం అందిస్తున్నారు. అయితే కవరేజీకి వెళ్లిన మీడియా.. సన్నీ డియోల్ ఇంటి ముందే పడిగాపులు కాచింది. ఆ సమయంలో మీడియాను ఉద్దేశిస్తూ సన్నీ కాస్త ఆగ్రహానికి లోనయ్యాడు. చేతులు జోడించి మరీ సన్నీ డియోల్ మీడియాను తిట్టేశాడు. మీకు సిగ్గుగా అనిపించడం లేదా, మీకూ తల్లితండ్రులు, పిల్లలు లేరా, సిగ్గుగా ఎందుకు లేదని సన్నీ అన్నారు.

ధర్మేంద్ర గురించి న్యూస్‌ను ప్రచురించే ఉద్దేశంతో కొన్ని రోజుల నుంచి ఫ్యామిలీ ఇంటి ముందే మీడియా ఎదురుచూస్తున్నది. దీంతో తీవ్ర ఫ్రస్టేషన్‌కు గురైన సన్నీ డియోల్ తనదైన స్టయిల్‌లో తన కోపాన్ని వ్యక్తం చేవ్శాడు. ప్రైవసీ ఇవ్వాలంటూ కోరాడు. సన్నీ ఆగ్రహానికి చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది.

సోషల్ మీడియాలో చాలా మంది యూజర్లు సన్నీకి మద్దతు తెలిపారు. డియోల్ ఫ్యామిలీ ప్రైవసీని మీడియా గౌరవించడం లేదని కొందరు యూజర్లు అన్నారు. ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆయన కూతురు ఈషా డియోల్ పేర్కొన్నారు.

# దర్శకత్వం చేస్తానంటున్న రానా



నటుడు రానా తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు. తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులుకున్నాడు కూడా. ఈ నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి అభిప్రయాలు పంచుకున్నాడు. వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు. నటుడిగా, నిర్మాతగా, పంపిణీదారుడిగా సినిమా రంగం గురించి పూర్తి అవగాహన ఉన్న రానా మెగాఫోన్ పడితే చిరకాల కోరికను నెరవేర్చుకున్నవాడు అవుతాడు. రానా దర్శకత్వం వహించే సినిమాను ఓన్ బ్యానర్ లో చేస్తాడా? బయటి నిర్మాణ సంస్థలో చేస్తాడా అనేది తెలియాల్సి ఉంది. అలానే తాను డైరెక్ట్ చేసే సినిమాలో రానా నటిస్తాడా? లేకపోతే కేవలం దర్శకత్వానికే పరిమితం అవుతాడా? అన్నది చూడాలి.

# నాని, రామ్‌చరణ్‌లతో దుల్కర్ పోటీ

## ముగ్గురు సినిమాలు వచ్చే ఏడాదికి విడుదల










ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోని వివిధ భాషల్లో తమకంటూ సెపరేటు ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటారు టాలీవుడ్ యాక్టర్లు రాంచరణ్, నాని, మాలీవుడ్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. యాక్టింగ్‌కు సంబంధించి ఈ ముగ్గురిలో ఎవరి స్టైల్ వారిదే.. ఈ స్టార్ హీరోల సినిమాలు ఒకేసారి బరిలోకి దిగితే ఎలా ఉంటుంది. అవును ఇప్పుడు ఆ వార్తే ఒకటి ఫిలింనగర్ సర్కిల్ లో రౌండప్ చేస్తోంది.దుల్కర్ సల్మాన్ నటించిన కాంత 14న ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిసిందే. దుల్కర్ సల్మాన్ మరోవైపు పవన్ సాదినేని డైరెక్షన్‌లో ఆకాశంలో ఒక తార సినిమాలో నటిస్తున్నాడు. అయితే ఈ సినిమా రాంచరణ్, నాని ప్రాజెక్టులతో కలిసి 2026లో విడుదల కానుందంటూ వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. నాని నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్. ఈ మూవీ శ్రీరామ నవమి కానుకగా 2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది. రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పెద్ది. ఈ మూవీ 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా టాక్ ప్రకారం దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న ఆకాశంలో ఒక తార కూడా ఇదే సీజన్‌లో విడుదలకు రెడీ అవుతుందట. ఒకవేళ ఇదే నిజమైతే రాంచరణ్, నాని నుంచి దుల్కర్ సల్మాన్‌కు గట్టి పోటీ ఉండబోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆకాశంలో ఒక తార చిత్రంలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటిస్తుండగా.. శృతిహాసన్ కీలక పాత్రలో నటిస్తోంది. లైట్ బాక్స్, స్వప్నా సినిమాస్, వైజయంతీ మూవీస్, గీతా ఆర్ట్స్ లాంటి లీడింగ్ బ్యానర్లపై తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# దేశంలో సగం మంది నన్ను చంపాలని చూశారు

## దకేరళ స్టోరీపై ఆదాశర్మ తాజా కామెంట్స్



వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు నటి అదా శర్మ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ 2023లో విడుదలైన ఈ సినిమా సినీ, రాజకీయ రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ చిత్రం విడుదలైనప్పుడు దేశంలో సగం మంది తనను చంపాలని చూశారని అదా శర్మ తాజాగా వెల్లడించారు. రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు మరింత విలువ పెరుగుతుంది. '1920' సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నా తొలి చిత్రమే పెద్ద సాహోసోపేతమని నేను భావిస్తాను. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దాని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పుడు బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకున్నారు. మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించారు' అని అదా తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి అదా మాట్లాడుతూ సవాలుతో కూడినవి మాత్రమే ఇష్టపడతానన్నారు. 'పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సన్నివేశాలు ఉండాలి. నేను చేసే పాత్రలో ఎమోషన్ టచ్ ఉండాలి. అది చూసి నా కుటుంబం ఒకింత ఆందోళన చెందాలి. అవన్నీ లేకపోతే ఇక ఆ పాత్ర చేయడం ఎందుకు అని నాకు అనిపిస్తుందని అదా శర్మ చెప్పారు.

# ఫైట్స్ చేస్తున్న మన శంకర వర ప్రసాద్‌గారు

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది.ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ వల్ల షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

## ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక కాళోజీని కొనియాడిన వన్నం రామారావు.



బయ్యారం,తోవ్వ,నవంబర్ 13.
ప్రజాకవి కాళోజీ నారాయణ రావు వర్ధంతి సందర్భంగాఆయనకు నివాళులర్పించిన బయ్యారం మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వన్నం రామారావు.అణచివేతను ఎదిరించిన గొప్ప తత్వం ఆయనదనిప్రజాకవి,పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత కాళోజీ నారాయణ రావు వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు.కాళోజీ తెలంగాణ గడ్డ గర్వించదగ్గ కలం యోధుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ ఉద్యమకారుడు వన్నం రామారావు కొనియాడారు."ఒక్క సిరా చుక్క.. లక్ష మెదళ్లకు కదలిక అంటూ అక్షరాలను ఆయుధాలుగా చేసి, పాలకులపైకి ఎక్కుపెట్టిన తెలంగాణ తొలిపొద్దు కాళోజీ" అని అన్నారు.అణచివేత, అన్యాయం ఎక్కడ, ఏ రూపంలో ఉన్నా దానిని ధైర్యంగా ఎదిరించిన తత్వం ఆయనదని ప్రశంసించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా,తెలంగాణ విముక్తి కోసం కాళోజీ చేసిన పోరాటాన్ని రామారావు గుర్తు చేసుకున్నారు.

## ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలి

### ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించిన బిజెపి జిల్లా నేత పాపారావు



తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 13
మండలంలోని మునిగేల వీడు గ్రామంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అనుకూలంగా ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని ధాన్యంకొనుగోలు కేంద్రానికి కేటాయించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ కు బిజెపి జిల్లా నేత నల్లని పాపారావు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 717, 670 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములు ఉన్నాయని సర్వేయర్లతో ప్రభుత్వం సర్వే చేయించి అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. కొంతమంది కబ్జాకోరులు, అధికారుల అండదండలతో పట్టా చేసుకొని క్రయవిక్రయాలు చేయడానికి సిద్ధమవుతున్నారని త్వరితగతిన సర్వే నిర్వహించాలన్నారు. ఇప్పటికే ప్రైవేటు భూములలో దాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారని తద్వారా రైతాంగం నానా ఇబ్బందులు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకునే విధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని కాపాడుదామని అందుకు అవసరమైన చర్యలు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాల ఇస్తామని ఎమ్మెల్యేహామీ ఇచ్చారు.

## బోగస్ మాటలు చెప్పాం....

## బోనస్ చెల్లింపులు చేసి తీరుతాం

### రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి దళారీ వ్యవస్థను నిర్మూలించాలి

### మిల్లర్లు కటింగ్ ల పేరుతో దగా చేస్తే మిల్లులపై కొరడా జులుపిస్తాం

### ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంబ సభలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్



తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 13
గత ప్రభుత్వం రైతులకు బోగస్ మాటలు చెప్పినట్లు ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చెప్పేది లేదని ఇచ్చిన హామీ ప్రకారం సన్నధాన్యానికి బోనస్ చెల్లింపులు చేసి తీరుతామని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ రైతులకు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని మునిగల వీడు, నెల్లికుదురు గ్రామాల్లో ఐకెపి, పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను తొర్రూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్టు నాయక్, పిఏసిఎస్ చైర్మన్ గుండా వెంకన్న, లతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు సన్న బియ్యం తినాలనే లక్ష్యంతో సన్నధాన్యాన్ని సేకరించడంతోపాటు రైతులకు ప్రోత్సాహంగా బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు,త్రాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని ఎలాంటి అవకతవకలకు పాల్పడిన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సంబంధిత శాఖ అధికారులు కాంటాలు అయిన వెంటనే తరలింపు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రమ పద్ధతిని పాటించి రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని కోరారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారీలకు విక్రయించి మోసపోవద్దని హితవు పలికారు. ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రైతును రాజు చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పునరుద్ఘాటించారు. మిల్లర్లు కటింగ్ ల పేరుతో మోసాలకు పాల్పడితే మిల్లులను సీజ్ చేసి తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ చందా నరేష్, వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీనివాస్, ఏపీఎం నరేంద్ర కుమార్, పి ఎస్ ఎస్ ప్రత్యేక అధికారి మనోహర్ రావు, సీఈఓ లు కత్తుల వెంకన్న, బంధారపు యాదగిరి గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మద్ది రాజేష్ పటేల్, స్థానిక నేతలు పట్నం శెట్టి నాగరాజు, ఇసంపల్లి వెంకటేష్, తుప్పతూరి రాజు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సిరివెన్నెల మహిళా సంఘం అధ్యక్షురాలు హరీఫ్, సభ్యులు సునీత, రమాదేవి, సీసీలు, సి ఎ జిల్లా కవిత, జిల్లా మండల నేతలు రైతులు తదితరులు ఉన్నారు.

## పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### ఎర్రబెల్లి గూడెం పిఏసిఎస్ చైర్మన్ పానుగోటిదేవేందర్ రావు



తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 13
ప్రాథమిక సహకార సంఘం ఎర్రబెల్లి గూడెం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఏసిఎస్ చైర్మన్ పానుగోటి దేవేందర్ రావు రైతులను కోరారు. గురువారం మండలంలోని ఎర్రబెల్లి గూడెం, మేచ రాజు పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేస్తుందని అందుకు రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరతో పాటు సన్నధాన్యానికి బోనస్ చెల్లింపులు జరుగుతాయన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రైతులు విక్రయించుకోవాలన్నారు. రైతులు క్రమ పద్ధతి పాటించి ధాన్యాన్ని కాంటాలు వేసుకోవాలన్నారు. ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంటాయని రైతులు అధైర్య పడవద్దు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో పులి సుభాష్, డైరెక్టర్లు కొయ్యేడి వెంకటేశ్వర్లు గౌడ్, కోటగిరి రమేష్ గౌడ్, కోయగూర దేవేందర్ రెడ్డి, సారం పెల్లి వెంకటరెడ్డి, జేరిపోతుల వెంకటయ్య, బాలు నాయక్, రైతులు తదితరులు ఉన్నారు.

## రాజులకొత్తపల్లిలో హజార హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

### వరిపల్లి అనిల్ కుమార్, టిఆర్పి రాష్ట్ర యువ నాయకులు



తొవ్వ ,నెల్లికుదురు .నవంబర్ 13:
మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారి ఆదేశాల మేరకు, టిఆర్పి రాష్ట్ర యువ నాయకులు వరిపల్లి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో హజార హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది.ఈ శిబిరంలో గ్రామ ప్రజలు భారీగా హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు, ఔషధాల పంపిణీ వంటి సేవలు ఉచితంగా అందించబడ్డాయి. ఈ శిబిరం విజయవంతంగా నిర్వహించబడటానికి సహకరించిన హజార హాస్పిటల్ వైద్య బృందానికి మరియు గ్రామ పంచాయతీ సిబ్బంధులకు అనిల్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.అనిల్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి శిబిరాలు తరచుగా నిర్వహిస్తామని, సమాజ సేవే తమ లక్ష్యమని తెలిపారు.

## రాష్ట్రంలో తొలిసారిగా బయ్యారం మండలంలో రైతులకు కార్డు ద్వారా ఎరువుల పంపిణీ.

### -యూరియా పంపిణికి పోలీస్ పహారా లేదు.

### -ఎరువుల కోసం సొసైటీల వద్ద చెప్పుల క్యూ లైనులు ఉండవు.

### -రైతులకు ఎరువుల కార్డుల పంపిణిలో వ్యవసాయ అధికారి రాజు ఆనందభాష్పాలు.



బయ్యారం,తోవ్వ,నవంబర్ 13:.
మండలంలో ఖరీఫ్ పంట కాలంలో ఆర్ఓఎఫ్ఆర్,పట్టా భూములు,అసైన్డ్ భూములున్న,పోడు సాగు రైతులు యూరియా కోసం ప్రమాదాలకు గురై రైతులు మరణించిన సందర్భాలు,క్యూ లైనులో నిలబడి,అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఎలాగైనా రైతులకు ఎరువుల ఇబ్బంది లేకుండా సమగ్ర ఎరువుల విత్తనాల పంపిణీ జరిగే విధంగా రాష్ట్రంలోని బయ్యారం మండలాన్ని ఒక రోల్ మోడల్ గా రూపకల్పన చేయాలనే పట్టుదలతో స్వయంకృషితో రైతులకు ఎరువుల పంపిణి కోసం రైతు కార్డు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో రైతు సహకార సంఘ సబ్ సెంటరులో రైతులకు సమగ్ర ఎరువుల, విత్తనాల యాజమాన్య కార్డులను రైతులకు ఏఓ రాజు,ఏఈఓ నాగరాజు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల కార్డు పంపిణి ద్వారా సోసైటీల వద్ద రైతుల చెప్పుల క్యూ లైనులు,పోలీస్ పహారాలు, అధికారుల పైరవీలు,ఎరువులు పక్కదారి పట్టకుండా కట్టడి చేయవచ్చని తెలిపారు.అనుకున్న సమయంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుతాయనీ తెలిపారు.అదేవిధంగా జిల్లా వ్యవసాయ అధికారులతో,జిల్లా కలెక్టర్ తో తన ఎరువుల పంపిణి కార్డు రూపకల్పన ఆలోచనలను వారితో పంచుకొని వివరించినట్లు తెలిపారు.తన రూపకల్పన చేసిన కార్డు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తే రైతులు క్యూలైన్లో నిలబడే అవసరం లేదని, అధికారులు ఆందోళన లేకుండా ప్రతి రైతు నీచ్చంతగా రైతు కార్డు ద్వారా తనకు కావలసిన విత్తనాలు నమోదు,ఎరువులు విడతల వారీగా నమోదు ప్రక్రియ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు.ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.ఈ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఏవో రాజు తన ఆనందభాష్పాలతో మండలంలో యూరియా కోసం రైతుల పడిన బాధలను, ఆవేదనలను రైతులతో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఇఓలు తేజస్విని,ఫయాజు,అఖిల్,సొసైటీ సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టం చేయాలని ధర్మ పోరాట దీక్ష

**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 13**

బీసీలకు విద్య, ఉద్యోగ రాజకీయ రంగాలో42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ వలిగొండ మండల కేంద్రంలో గురువారం బీసీ సంఘం జిల్లా నాయకుడు సాయిని యాదగిరి ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్షను చేపట్టారు. ఈ దీక్షా శిబిరానికి అఖిలపక్ష పార్టీ లు ,వివిధ కుల సంఘాల సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావాలన్నారు. రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బీసీలకు న్యాయమైన డిమాండ్ 42 శాతం రాజకీయ ,ఉద్యోగ భద్రత కు రిజర్వేషన్ల అమలుకై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య,బి.ఎస్.పి జిల్లా ఉపాధ్యక్షులు గుండు కృష్ణ గౌడ్, మండల అధ్యక్షులు సుక్క శ్రీకాంత్, టి యు జేఏసీ రాష్ట్ర నాయకులు గాజుల యాదగిరి,డి.ఎస్.పి జిల్లా నాయకులు రాకేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పల్లెర్ల రామచందర్,గంధమల్ల శ్రీనివాస్, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## భవిష్యత్ వరదలను తట్టుకునేలా ప్రత్యేక కార్యాచరణ

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



తొవ్వ .ప్రతినిధి ,నవంబర్ 13బీ

వరంగల్ నగరంలో భవిష్యత్‌లో అకాల వర్షాల ప్రభావం వల్ల నష్టాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు.గురువారం రోజున ఎమ్మెల్యే నగర మేయర్ గుండు సుధారాణి , నగర కమిషనర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ కలిసి 31వ డివిజన్ హంటర్ రోడ్డులోని నందిహిల్స్ కాలనీని సందర్శించారు. పై ప్రాంతాల నుండి వచ్చే వర్షపు నీరు కాలనీలోకి చేరి కలిగించే ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకుంటాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని తెలిపారు. అధికారులను సక్రమ ప్రణాళికలు సిద్ధం చేసి, తక్షణమే అవసరమైన పనులు ప్రారంభించాలంటూ ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిళ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మోహన్ రావు,టీపీసీసీ జగన్ మోహన్ రెడ్డి,కాలనీ పెద్దలు సుబ్బరాజు, పొగాకుల శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ గొంది జగన్, పసునూటి సురేష్ తదితరులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# సత్యసాయి శత జయంతి వేడుకలను విజయవంతం చేయాలి,

సాయి భక్తులందరికీ ఇదే ఆహ్వానం,

భగవాన్ బాబా ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాలి,

శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్,



**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి నవంబర్ 13,**

ఈనెల 23న నిర్వహించే శ్రీ భగవాన్ సత్య సాయిబాబా నూరవ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని సత్యసాయి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో తొవ్వ ప్రతినిధి తో ఆయన మాట్లాడుతూ ఈనెల 23న నిర్వహించే భగవాన్ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలకు అందరూ ఆహ్వానితులే ముఖ్యంగా సాయి భక్తులకు ఇదే ఆహ్వానంగా భావించి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వీలున్న భక్తులు సత్యసాయి నూరవ వసంతం వేడుకలకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. సేవే మార్గంగా సాయి ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న ప్రతి పనికి అందరూ ఆహ్వానితులే అన్నారు. శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మన మధ్య లేకపోయినా ఆయన మధుర స్మృతులను ఆయన చేసిన సేవలను ఆయన చూపిన మార్గాన్ని మనం ఎంచుకొని ఆ మార్గంలో నడిచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. షిరిడి సాయి ఆరాధనలు సత్యసాయి సేవా మార్గాలను ఏకతాటిపై నడిపిస్తూ భక్తులకు చేరువగ ఉంటూ భక్తుల ఆదరాభిమానాలతో సేవా ట్రస్ట్ ముందుకు నడుస్తూ మరెన్నో సేవా మార్గాలు నిర్వహించేందుకు సాయి భక్తుల అమూల్యమైన సలహాలను ఇస్తూ ట్రస్టును ముందుకు నడిపించేందుకు మార్గాన్ని సుమంగంగా చేసుకుంటూ వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి తిరుమలరావు. సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత మిస్సింగ్ కేసు నమోదు



తొవ్వ, గార్ల నవంబర్ 13:

వివాహిత మహిళా మిస్సింగ్ సంఘటనగా గార్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది.గార్ల మండల బుద్ధారం గ్రామానికి చెందిన వాంకుడోత్ శంకర్ పోలీస్ స్టేషన్ వచ్చి తన భార్య అయినా వాంకుడోతు సంధ్య వయసు (35)గత రెండు రోజుల నుండి ఇంట్లో ఏ పని చేయకుండా ఫోన్ మాట్లాడుతూ ఉండగా మందలించగా బుధవారం నాడు ఉదయం 9 గంటలకు భర్త శంకర్ కూలి పనికి వెళ్లిపోగా సంధ్య ఇంట్లో ఎవరు లేని సమయం చూసి ఇంట్లో వారికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయినదని చుట్టుప్రక్కల గ్రామాలలో, బంధువుల ఇంట్లో వెతికిన ఆచూకీ దొరకలేదని తగు చర్య గురించి పిర్యాదు మేరకు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ సాయికుమార్ తెలిపారు.

# పిఆర్వోలు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి,

శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న కుశాల్,

కమ్యూనికేషన్ పై పట్టు సాధించాలి,

సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్,

**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి నవంబర్ 13,**



జిల్లా పోలీస్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ పిఆర్ఓ కుశాల్ హైదరాబాద్ సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పిఆర్ఓ కుశాల్ కి ప్రశంసా పత్రాన్ని జిల్లా ఎస్పీ సుధీర్ రామనథ్ కేకన్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పి ఆర్ ఓ లు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి అని అన్నారు. కమ్యూనికేషన్ లపై పట్టు సాధించాలని సూచించారు. సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో నిర్వహించిన ట్రైనింగ్ లో ప్రతిభ కనబరిచి కుషాలను అభినందించారు. ప్రజలతో సాన్నిహిత్యం పెంచే వారధిగా, పోలీస్ శాఖ ప్రతిష్ఠను బలపరచే ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించాలని సూచించారు.ఈ సందర్భంగా కుశాల్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను ప్రజా సేవలో మరియు కమ్యూనికేషన్ వ్యవస్థలో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి రిమాండ్

**తొవ్వ కేసముద్రం,నవంబర్ 13**,:చెక్ బౌన్స్ కేసులో అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు వారి విచారణ కు హాజరు కాకుండా 2019 నుండి తప్పించుకు తిరుగుతున్న తొర్రూర్ కి చెందిన గంగోత్రి వాటర్ ప్లాంట్ యజమాని బాధవత్ కిషన్ పై కోర్టు వారు వారంట్ జారీ చేయగా,కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్ రెండవ ఎస్సై నరేష్ లు తమ సిబ్బంది తో కలిసి బాధవత్ కిషన్ ను అదుపులోకి తీసుకొని, గురువారం కోర్ట్ లో హాజరు పరుచగా కోర్టు వారు బాధవత్ కిషన్ కి రిమాండ్ విధించి జైలు పంపించడం జరిగింది.

# గిరిజన సంక్షేమ హాస్టల్స్ పై ఎంపీ నజర్ .....

## విద్యార్థులకు సరైన మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు

గిరిజన కమిషనర్ , జిల్లా గిరిజన శాఖ డిడి తో ఫోన్ లో మాట్లాడిన ఎంపీ బలరాం నాయక్ .

**తొవ్వ,మహబూబాబాద్ , నవంబర్ 13:**

గిరిజన సంక్షేమ హాస్టళ్ల లో విద్యార్థులను మన ఇంట్లో పిల్లల చూసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెస్ చార్జీలు పెంచి పౌష్టికాహారం అందిస్తున్న వార్డెన్స్ అధికారులు విద్యార్థులకు అందించడం లేదని వారిపై చర్యలు తప్పవని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ అన్నారు , జిల్లా లోని గిరిజన హాస్టళ్ల పై నజర్ వేసి చరవాణి ద్వారా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరామ్ నాయక్ తో మాట్లాడి హాస్టళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు ,ఇటీవల ముత్యాలమ్మ గూడెం లో జరిగిన విద్యార్థి



ఆత్మహత్య ఘటనపై వాకబు చేసి వార్డెన్ , హెడ్ మాస్టార్ల చర్యలు తీసుకోవాలన్నారు జిల్లాలోని గిరిజన హాస్టళ్లను తనిఖీ చేస్తానని , అన్నారు జిల్లాలోని గిరిజన హాస్టళ్ల పై రాష్ట్ర గిరిజన కమిషనర్ తో మాట్లాడి పూర్తి వివారలు తెలిపి చర్యలు తీసుకోవాలన్నారు

# నాయి బ్రాహ్మణుల డిమాండ్ల సాధనకై...

## నాయి బ్రాహ్మణ జన జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రని జయప్రదం చేయండి

తొవ్వ నవంబర్ 13 సంస్థాన్ నారాయణపూర్:




నాయి బ్రాహ్మణుల డిమాండ్ల సాధన కోసం నాయి బ్రాహ్మణ జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పునంతల బాలకృష్ణ %ు% రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తేదీ: 18 -11- 2025 మంగళవారం రోజున ఉదయం 9 గంటలకు హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తా లోని మలిదశ తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతచారి విగ్రహం నుండి ట్యాంక్ బండ్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం వరకు పాదయాత్ర కొనసాగుతుంది. ఇట్టి మన కార్యక్రమానికి అధిక సంఖ్యలో నాయి బ్రాహ్మణులు విచ్చేసి మన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతున్నాం. మన క్షౌర వృత్తిలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించి మన బతుకుదెరువు పై దెబ్బతీస్తుంటే మనం పోరాటం చేయొద్దా సోదరులారా.. ఆలోచించండి.! నేటికి సమాజంలో మన సామాజిక వర్గంపై వివక్షచూపుతూ, కులం పేరుతో దూషించకుండా, అవమానించకుండా ఆత్మగౌరవం కోసం, మన హక్కుల పరిరక్షణ కోసం పోరాడుదాం రండి కలిసి రండి.. బీసీల్లో అత్యంత వెనుకబాటుకు గురవుతున్న మన నాయి బ్రాహ్మణులు రాజకీయంగా, విద్య, ఉపాధి రంగాల్లో మన జాతిని చైతన్యపరిచేందుకు నాయి బ్రాహ్మణ జన జాగృతి యుద్ధానికి సిద్ధమైంది. మన హక్కులను న్యాయబద్ధంగా దక్కాల్సిన అవకాశాలను పాలకులు నిర్లక్ష్యానికి గురి చేస్తున్న తీరుకు నిరసనగా మనం పోరాడుదాం రండి. ̥ ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవుల్లో మొదటి ప్రాధాన్యతను ఇచ్చి అవకాశాలు కల్పించాలి. ̥ క్షౌరశాలల ఏర్పాటుకు ఐదు లక్షల నుంచి 10 లక్షల వరకు వడ్డీ లేని, ఎలాంటి శరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలి. ̥పోలీసుశాఖలో క్షురకాల పోస్టులు భర్తీ చేయాలి,వైద్య ఆరోగ్యశాఖలో నియమించే ఆశవర్కాల నియామకాలలో నాయి బ్రాహ్మణ మహిళల కు అధిక పోస్టులు కేటాయించాలి. ̥42 శాతం బీసీ రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ చేసి అత్యంత వెనుకబడిన నాయి బ్రాహ్మణులకు సామాజిక న్యాయం చేయాలనే డిమాండ్ల సాధనకై రండి తరలిరండి.. సోదరులారా... నాయి బ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా, ఆత్మగౌరవం కోసం జన జాగృతి చైతన్యపరిచే కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని మన నాయి బ్రాహ్మణుల హక్కులను, సమస్యలను పరిష్కరించుకుందామని తెలియజేస్తూన్నం. తప్పకుండా ఈ పాదయాత్ర కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం.

# కుటుంబ విలువలు సాంప్రదాయాలను తెలిపే పవిత్ర బంధమే వివాహ బంధం

### ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్

### చెడు పాక కార్తీక్, ప్రవలిక దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 13



కుటుంబ విలువలు సాంప్రదాయాలను పెంపొందింప చేసేదే పవిత్ర బంధమైన వివాహ బంధమని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పార్వతమ్మ గూడెం స్టేజి వద్ద ఉన్న ఎంకేఆర్ గార్డెన్ లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదవ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్న నాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన విభాగం కార్యకర్త చెడుపాక కార్తీక్ ప్రవల్లిక దంపతుల వివాహ మహోత్సవానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల యాదవ రెడ్డి , మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ లతో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల వివాహాలకు ఎలాంటి అవంతరాలు లేకుండా జరిగే విధంగా కళ్యాణ లక్ష్మి పథకాన్ని అందిస్తోందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద బతుకులు వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. పేద ఆడపడుచులకు పెద్దన్నగా రేవంత్ రెడ్డి అండగా ఉంటున్నారన్నారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఇనుగుర్తి మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్, జిల్లా నేత భైరు అశోక్ గౌడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెడుపాక వెంకన్న, ఏఎంసి మాజీ డైరెక్టర్ సుందర్ నాయక్, కిషన్ నాయక్ వివిధ గ్రామాల నేతలు తదితరులున్నారు.

# ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి


## సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి గ్రామీణ సర్వే

యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :నవంబర్ 13



పాలకుల అసమర్థ విధానాలతో గ్రామీణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కారం చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లల పెంటయ్య,సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ పిలుపులో భాగంగా మండలంలో కొమ్మాయిగూడెం, మునిపంపుల, దుబ్బాక,బోగారం గ్రామాల్లో వేరువేరుగా ఇంటింటి కుటుంబ గ్రామీణ సర్వే నిర్వహించి ప్రజలను నేరుగా కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ గ్రామీణ కుటుంబ సర్వేను ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అత్యధికంగా వ్యవసాయ ఆధారిత రైతు,కూలీ కుటుంబాలు ఉన్నవని అప్పులు చేసి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు చివరికి ఎలాంటి లాభం లేక అప్పుల పాలవుతూ అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. సాంకేతికత, నూతన యంత్రాలు వాడినా పెట్టుబడి పోను చేతికి చిల్లర కూడా మిగడం లేదని వాపోతున్నారని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి కనీసం ఇల్లు గడవడం లేదని చేసే కూలీ పనికి వచ్చిన డబ్బులతో సంసారం గడవక ప్రైవేటు ఫైనాన్స్ లు తీసుకొస్తే వారు వేధింపులకు గురి చేస్తున్నారని వాపోతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు లేక నాణ్యమైన విద్య అంధక పోటీ ప్రపంచంలో ప్రైవేటు బడుల్లో చేర్పిస్తూ ఫీజులు కట్టలేక పోతున్నారని వచ్చే ఆదాయం పూర్తిగా చదువులకు దీర్ఘకాలిక రోగాలకు ఖర్చవుతుందని గత ఐదు సంవత్సరాల నుండి నూతనంగా పెన్షన్లు రాక అనేకమంది వేచి చూస్తున్నారని, ( ఉపన్యాసాలతో కాలమెల్ల తీస్తున్నాయి తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిత సమస్యలను పరిష్కారం చేయడంలో ప్రభుత్వ అధికారులు, యంత్రాంగం చొరవ చూపడం లేదనిఅన్నారు. నేరుగా ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకుంటే ఈ సమస్య స్పష్టం అవుతుందని అన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్యలు పరిష్కరించాలని వచ్చిన సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనంతరం పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని సమస్యల రూపం మాపడం కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్ బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్,జంపాల అండాలు, కందుల హనుమతు,మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, భావండ్లపల్లి బాలరాజు, వేముల సైదులు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటపాక శివకుమార్ శాఖా కార్యదర్శులు తాళ్లపల్లి జితేందర్, శానగొండ వెంకటేశ్వర్లు, గుండాల ప్రసాద్,కూనూరు మల్లేశం, నాయకులు తొలుపులూరి చంద్రశేఖర్, గుండాల నరేష్, ఎర్ర కాటమయ్య, బూడిద బిక్షం, కుక్కడపు స్వామి, శానాగొండ రామచంద్రం,గట్టు గోపయ్య,గుండాల అనిల్ కుమార్, గాదె రాజకుమార్, అంతటి సత్తయ్య, కూనూరు జంగయ్య,గుణగంటి మల్లేశం, తుర్కపల్లి నరేష్, బాణాల నవీన్ రెడ్డి,జల్లెల మల్లేశం,సాయి,సందీప్,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కిల్ల లో మధ్యాహ్న భోజనమును పరిశీలించిన ఎంపీడీవో



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 13

రామన్నపేట మండల పరిధిలోని ఇస్కిళ్ళ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ను గురువారం ఎంపీడీఓ రాములు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు .అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించినారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీ వెంకన్న , పంచాయతీ కార్యదర్శి శ్రీ వెంకటేష్ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్ టియు మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.దయరత్నం మరణం పట్ల సంతాపం



తొవ్వ ,హైదరాబాద్, నవంబర్ 13: జేఎన్ టియు మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.దయరత్నం ఆకస్మిక మరణం పట్ల వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి క్రిస్ట్ లీ గ్రెస్, బీజే వినయ స్వరూప్ లు సంతాపం ప్రకటించారు. నారాయణగూడ లోని వైఎంసీఏలో శుక్రవారం ప్రొఫెసర్ డాక్టర్ పి.దయరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దయరత్నం (93) హబ్సిగూడలో ఉంటున్నారు. ఈనెల 11వ తేదీన ఆయన మరణించారు. దయరత్నం మరణం పట్ల ఇంజనీరింగ్, విద్యా సమాజంతో పాటు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్, స్ట్రక్చరల్ ఇంజనీర్, విద్యావేత్త, రచయితగా ఆయన భారతదేశ ఇంజనీరింగ్ ల్యాండ్ స్కేప్ లో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. 1932లో జన్మించిన ఆయన మద్రాస్ విశ్వవిద్యాలం నుండి సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీని, తర్వాత బౌల్డర్ లోని కొలరాడో విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్, పిహెచ్ డి పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తన కెరీర్ ను ప్రారంభించి, ఆ తరువాత ఐఐటి కాన్పూర్ లో చేరి, సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి అధిపతిగా, ఆర్ అండ్ డి డీన్ గా పనిచేశారు. జెఎన్ టీ యు వైస్ చాన్సలర్ గా కూడా పనిచేశారు. ఆయన దార్శనిక నాయకత్వం విద్యా, పరిపాలన వ్యవస్థలను బలోపేతం చేసింది. అధ్యాపకులు, విద్యార్థుల నుండి ఆయన ప్రశంసలు పొందారు. డాక్టర్ దయరత్నం పది ప్రభావవంతమైన పాఠ్యపుస్తకాలు మరియు 120 కి పైగా పరిశోధనా పత్రాలను రచించారు. నిర్మాణ ఇంజనీరింగ్ లో సిద్ధాంతం మరియు అభ్యాసాన్ని వంతెనలు చేశారు. ఎత్తైన భవనాలు, వంతెనలు, విద్యుత్ కేంద్రాలు మరియు దుస్థితిలో ఉన్న నిర్మాణాలపై ఆయన చేసిన కృషి విద్యావేత్త మరియు అభ్యాసకుడిగా ఆయన ద్వంద్వ పాత్రను ప్రదర్శించింది.

సర్ ఆర్థర్ కాటన్ గోల్డ్ మెడల్, నికోలైడాస్ ప్రైజ్, నేషనల్ ప్రేస్టేస్ట్ కాంక్రీట్ డిజైన్ అవార్డు, అత్యుత్తమ కాంక్రీట్ కంట్రిబ్యూషన్ అవార్డు మరియు కొలరాడో విశ్వవిద్యాలయం నుండి విశిష్ట ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల అవార్డు వంటి అనేక గౌరవాలు ఆయనకు లభించాయి. సైన్స్ అండ్ టెక్నాలజీకి చేసిన కృషికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనను రాజీవ అవార్డుతో గుర్తించింది. జేఎన్ టీయు హైదరాబాద్ ఆయనకు గౌరవ డాక్టరేట్ (పీహెచ్డీ) ను ప్రదానం చేసింది. ఆయన మార్గదర్శకత్వం, స్కాలర్షిప్ మరియు సేవ ద్వారా తరతరాలుగా ఇంజనీర్లకు స్ఫూర్తినిచ్చారు. ఆయన వారసత్వం ఆయన నిర్మించిన సంస్థలు, ఆయన మార్గనిర్దేశం చేసిన విద్యార్థులు మరియు ఆయన దార్శనికత ద్వారా రూపొందించబడిన మౌలిక సదుపాయాలలో ఆయన చేసిన సేవలు కొనసాగుతున్నాయని వారు తెలియజేశారు.

# నేడు జూబ్లీ ఎన్నికల ఫలితాలు

## అధికార పార్టీ ఫలితాలను బట్టి స్థానిక ఎన్నికలు కు ముహూర్త

తొవ్వ ,ప్రతినిధి , నవంబర్ 13బీనేడు ఉత్కఠభరితంగా సాగిన జూబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయ్ ,నెలరోజుల నుంచి అధికార , కాంగ్రెస్ ప్రతిపక్ష బిఆర్ ఎస్ పార్టీలు, ఇజ్జత్ కె సవాల్ గా తీసుకొని ప్రచారం నిర్వయించాయి , బి ఆర్ ఎస్ తమ సిట్టింగ్ సీటు కాపాడుకోవడాం కోసం అహర్నిశలు శ్రమించారు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఏకంగా రెఫరెండం ఆఫ్ జూబ్లీ ఎలక్షన్ అంటూ ప్రచారం చేశారు అటు అధికార కాంగ్రెస్ పార్టీ సైతం తమ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం మంత్రులు ముఖ్యమంత్రి తో సహా ప్రెస్టీజ్ గా తీసుకొని ముందుకు వెళ్లారు , ఏది ఏమైనా జూబ్లీ ఫలితాలు కాంగ్రెస్ బి ఆరేస్ కి సవాలుగా మారాయి ,ఇక స్థానిక ఎన్నికలు జూబ్లీ ఎన్నిక ల ఫలితాలతో ముడి పడివున్నాయని కాంగ్రెస్ గెలిస్తే పాత రిజర్వేషన్ ప్రకారం స్థానిక ఎన్నికలకు వెళ్ళాలనే యోచనలో ఉన్నట్టువిశ్వసనీయ